



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 249 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 16 మే 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :249 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 16 MAY 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం

- ఏపీలో పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు
- రూ.33 వేల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- పరిశ్రమల ఆకర్షణే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 6వ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు రూ. 33 వేల కోట్లకు పైగా విలువైన 19 పారిశ్రామిక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడులు ప్రధానంగా ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో రానున్నాయి. వీటి ద్వారా సుమారు 35 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కుతాయని అంచనా. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామికవేత్తలను తిరిగి ఆకర్షించడంలో ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. గడచిన 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఆరుసార్లు సమావేశమై, మొత్తం 76 ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులు రానుండగా, 4,50,934 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా పూర్తిచేశాయి.

**6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు :**

6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**ఐ అండ్ సి డిపార్ట్మెంట్:**

1) డెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా – రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు
2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా – రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు
3) పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా – రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు
4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు
5) జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

**టెక్స్టైల్ డిపార్ట్మెంట్:**

6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా – రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు
7) మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా – రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు
8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా – రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు

**ఏపీఐఐసీ డిపార్ట్మెంట్:**

9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా –

వివరాలు 2లో..

## ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలి

- ఉత్తమ కార్యకర్తల సమావేశంలో నారా లోకేశ్ ప్రసంగం
- 11 నెలల ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలని కర్తవ్యబోధ



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రభుత్వం గత 11 నెలల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అధికారంలో ఉన్నప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, “బాబు సూపర్–6’, ‘బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ’లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం,” అని తెలిపారు. 11 నెలల ప్రజా ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు, వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచామని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పింఛన్ ఇవ్వడం లేదని గుర్తుచేశారు. పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, ఉచిత గ్యాస్ పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, జూన్ మాసంలో ‘తల్లికి వందనం’, ‘అన్నదాత సుఖీభవ’ పథకాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పాఠశాలలను మూసివేస్తున్నారంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని లోకేశ్

వివరాలు 2లో..

## సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో నిరాశ

- ఎస్సీ, ఎస్టీ కేసు.. భార్గవ్‌రెడ్డికి సుప్రీంలో చుక్కెదురు
- ట్రయల్ కోర్టుకే వెళ్లమన్న సుప్రీం
- సీనియర్ న్యాయవాది వాదనల కోసం విచారణ వాయిదా



**పెన్ పవర్ డెస్క్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. తన పై నమోదైన ఎస్సీ,

వివరాలు 2లో..

## డిప్యూటీ సీఎం పవన్‌ను తిరంగా ర్యాలీకి రావాలని పురందేశ్వరి పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**ఆపరేషన్ సిందూర్, భారత జవాన్లకు సంఘీ భావంగా దేశవ్యాప్తంగా బీజేపీ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో విజయవాడలోనూ తిరంగా ర్యాలీ నిర్వహించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నిర్ణయించారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు... రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం

- ముంబై వసాయి విరార్ కార్పొరేషన్ (వీవీఎంసీ) స్కామ్‌పై ఈడీ దర్యాప్తు వేగవంతం
- ముంబై, హైదరాబాద్ సహా 13 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు స్వాధీనం

వివరాలు 2లో..




## మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

- బీహార్ లో రాహుల్ గాంధీ పర్యటన
- దర్భంగాలో కాంగ్రెస్ అగ్రనేతను అడ్డుకున్న పోలీసులు
- విద్యార్థులతో మాట్లాడడం ఎప్పటి నుంచి నేరంగా మారిందన్న రాహుల్

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, సీఎం నితీశ్ కుమార్ లపై ధ్వజమెత్తారు. దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌లో విద్యార్థులతో ‘శిక్షా న్యాయ్ సంవాద్’

వివరాలు 2లో..



## పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

### కేంద్ర మంత్రి జైశంకర్ స్పష్టీకరణ

- పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే ఉంటాయని విదేశాంగ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ
- ఆపరేషన్ సిందూర్ ద్వారా కీలక లక్ష్యాలను భారత్ సాధించిందని వెల్లడి
- పహల్గామ్ దాడి తర్వాత భారత్‌కు విస్తృత అంతర్జాతీయ మద్దతు లభించిందన్న జైశంకర్
- పాక్ అణుకేంద్రాలను అంతర్జాతీయ పర్యవేక్షణకు అప్పగించాలన్న రాజ్‌నాథ్ సింగ్



**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్‌తో భవిష్యత్తులో ఎలాంటి చర్చలు జరిగినా అవి కేవలం ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలపైనే ఉంటాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గురువారం స్పష్టం చేశారు. ‘ఆపరేషన్ సిందూర్’ ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, నిర్దేశించుకున్న లక్ష్యాలను భారత్ సాధించిందని ఆయన నొక్కిచెప్పారు. ఢిల్లీలో హోండురాస్ రాయబార కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. “పాకిస్థాన్‌తో చర్చలు ఉగ్రవాదంపైనే ఉంటాయని ప్రధానమంత్రి చాలా స్పష్టంగా చెప్పారని నేను భావిస్తున్నాను. పాకిస్థాన్ అప్పగించాల్సిన ఉగ్రవాదుల జాబితా ఉంది, వారు ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మూసివేయాలి. వారికేం చేయాలో తెలుసు. ఉగ్రవాదంపై ఏం చేయాలో వారితో చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అవే ఆచరణ సాధ్యమైన చర్చలు” అని జైశంకర్ తెలిపారు.

వివరాలు 2లో..

## భూ రికార్డుల ప్రక్షాళనకు కేంద్రం బృహత్ ప్రణాళిక... టెక్నాలజీతో సమగ్ర సర్వే

### కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



- భూ వివాదాల పరిష్కారానికి కేంద్రం కొత్త సర్వే
- టెక్నాలజీతో సమగ్ర భూ సర్వే, రీసర్వే
- మొదటి దశకు రూ.3000 కోట్లు, రెండేళ్లలో పూర్తి
- ఆధార్‌తో భూ రికార్డుల అనుసంధానం తప్పనిసరి
- గుంటూరులో కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రకటన

**పెన్ పవర్ డెస్క్:**దేశంలో భూ రికార్డుల నిర్వహణలో నెలకొన్న లోపాలను సరిదిద్ది, వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా, కేంద్ర సమన్వయంతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల

వివరాలు 2లో..

## యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ప్రపంచ సుందరీమణులు



- అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి హాజరు
- ప్రపంచ సుందరి పోటీదారుల పర్యటనతో కట్టుదిట్టమైన భద్రత
- పోచంపల్లిని సందర్శించిన 25 ఆఫ్రికా దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు

**పెన్ పవర్ డెస్క్:**భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసిం హస్వామి వారిని గురువారం సాయంత్రం మిస్ వరల్డ్ పోటీదారులు దర్శించుకున్నారు. ఆలయ అతిథి గృహం నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాల్లో కొండపైకి చేరుకున్న ఈ సుందరీమణులు, అఖండ దీపారాధన మండపంలో జరిగిన జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి,

వివరాలు 2లో..

## పీఓకేను అప్పగించకుంటే మరిన్ని యుద్ధాలు తప్పవు

- పీవోకేను భారత్‌లో విలీనం చేయాలని కేంద్రమంత్రి రాందాస్ డిమాండ్
- ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం పాక్‌కు గుణపాఠం చెప్పిందని ప్రశంస
- వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి
- కాశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం అనవసరమని స్పష్టీకరణ

వివరాలు 2లో..



**పెన్ పవర్ డెస్క్:**పీఓకే అంశంపై కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలే కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకేను భారత్‌లో విలీనం చేయాల్సిందేనని, ఒకవేళ పాకిస్థాన్ అందుకు అంగీకరించని పక్షంలో దానిని స్వాధీనం చేసుకునేందుకు మరిన్ని యుద్ధాలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ను ప్రశంసించిన అథవాలే, ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఆర్మీకి తగిన రీతిలో బుద్ధి చెప్పిందని అన్నారు. “పాకిస్థాన్ ను భారత్ గట్టిగా దెబ్బతీసింది. కాల్పుల విరమణ అనేది కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. మన సైన్యం దాయాది దేశానికి సరైన గుణపాఠం నేర్పింది.

# రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం

- మొదటి పేజీ తరువాయి

రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు

10) అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా - రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు

**ఎనర్జీ డిపార్ట్‌మెంట్:**

11) నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా - రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు

12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు

13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా - రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు

14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు - రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు

**టూరిజం డిపార్ట్‌మెంట్:**

15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్ పి: తిరుపతి - రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు

16) స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి - రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు

17) వరుణ్ హాస్పటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం - రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు

**ఐటీ డిపార్ట్‌మెంట్:**

18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా - రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు

19) సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా - రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు

## ఎడిటర్ వ్యూ

# ఆపరేషన్ ఆంధ్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అవగతమయినట్లుంది. కిందిస్థాయిలో క్యాడర్ కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జనంలోకి వెళ్లడానికి జంకుతున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఏడాది పాలన పూర్తయిన నాటి నుంచి ఇక జోరుగా హామీల అమలుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు నిన్న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తన మనసులో మాట చెప్పకనే చెప్పారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం వెళ్లినా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో స్థానాలను కూటమి సాధించాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.

**ఏడాది పూర్తయిన సందర్భంగా...**

ఈ ఏడాది జూన్ పన్నెండో తేదీ నాటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది పూర్తవుతుంది. ఆరోజున లక్షమందికిపైగా వితంతు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తేదీలతో త్వరలో క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. ఏడాది పొడవునా ఏ ఏ హామీలు ఏ తేదీన అమలు చేయనున్నామో స్పష్టంగా ప్రజల ముందు ఉంచి వారికి ఖచ్చితమైన సమాచారం అందచేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఆరు నూరైనా ఆరోజు ఆ హామీని అమలు చేసేలా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను కూడా రెడీ చేసుకునేందుకు అధికారులకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించారు.

**మహిళల కోసం..**

మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే ఏ నెల నుంచి అమలు చేస్తారరన్నదానిపై ఇంకా స్పష్టత లేకున్నా త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని జిల్లా స్థాయిలో ప్రవేశపెట్టాలని రెడీ అయిపోయినట్లే కనిపిస్తుంది. దీపం పథకం ఇచ్చే మూడు సిలిండర్లకు సంబంధించి ముందుగానే నగదును లబ్దిదారుల ఖాతాలోనే విడుదల చేయాలని నిర్ణయించారు. సిలిండర్ బుక్ చేసుకున్నారా? లేదా? అన్నది సంబంధం లేకుండా ముందుగానే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. చాలా మందికి డబ్బులు పడటం లేదన్న ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల మహిళల ఓటు బ్యాంకు చెక్కు చెదరకుండా ఉండేలా ఇటు ఉచిత బస్సు పథకం, అటు దీపం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు.

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా...**

మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు ఓటు బ్యాంకు కూడా పటిష్టపర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాక్ - భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లే అవకాశముందని కూడా చంద్రబాబు అనుమానిస్తున్నారు. జమిలి ఎన్నికలు 2027 లేదా 2028 లో వచ్చినా ప్రజల్లో అసంతృప్తి లేకుండా అన్ని రకాలుగా గ్రౌండ్ ను చంద్రబాబు ప్రిపేర్ చేస్తున్నారు. ఈ సారి కూటమితోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటునట్లే కనపడుతుంది. ఇలా చంద్రబాబు జగన్ పాదయాత్ర చేసినా తన పథకాలతో జనాన్ని తన వైపునకు తిప్పుకునేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు నిర్ణయించి ఈ మేరకు ముందుకు వెళు తున్నారు.

# డిప్యూటీ సీఎం పవన్‌ను తిరంగా ర్యాలీకి రావాలని పురందేశ్వరి పిలుపు

- మొదటి పేజీ తరువాయి

(శుక్రవారం) ఈ ర్యాలీ నిర్వహించనున్నారు. విజయవాడలో ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ జరగనుంది. ఈ క్రమంలో తిరంగా ర్యాలీలో పాల్గొనాలని కూటమి నేతలను పురందేశ్వరి ఆహ్వానించారు. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆమె ఫోన్ చేసి, ర్యాలీలో పాల్గొనాలని కోరారు. దీంతో పురందేశ్వరి పిలుపు మేరకు జనసేనాని ఈ ర్యాలీలో పాల్గొంటానని చెప్పారు. ఇక, ఈ ర్యాలీలో సీఎం చంద్రబాబు కూడా పాల్గొంటారని పురందేశ్వరి వెల్లడించారు.

# పాకిస్థాన్‌తో చర్చలు కేవలం ఉగ్రవాదంపైనే

- మొదటి పేజీ తరువాయి

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది అమాయక పౌరుల మృతికి కారణమైన దారుణమైన ఉగ్రదాడి తర్వాత భారత్‌కు అంతర్జాతీయంగా విస్తృత మద్దతు లభించిందని ఆయన గుర్తుచేశారు. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ) అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించింది. "చాలా మంది మంత్రులు, నాయకులు ప్రధానమంత్రికి ఫోన్ చేశారు, నాకు కూడా పలువురు మంత్రులు ఫోన్ చేశారు. ఈ దాడికి పాల్పడిన వారిని బాధ్యులను చేయాలని భద్రతా మండలి తీర్మానం స్పష్టంగా పేర్కొంది. మే 7వ తేదీ ఉదయం, ఆపరేషన్ సిందూర్ ద్వారా తీసుకున్న చర్యలతో మేము వారిని బాధ్యులను చేశాం" అని జైశంకర్ వివరించారు.

**రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు**

అంతకుముందు శ్రీనగర్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశంలో ఎలాంటి ఉగ్రదాడి జరగనంత వరకే ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవిస్తుందని స్పష్టం చేశారు. పాకిస్థాన్ అణుకేంద్రాలను అంతర్జాతీయ పర్యవేక్షక సంస్థ ఆధీనంలోకి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీనగర్‌లోని బాదామీ బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 15వ కోర్ ప్రధాన కార్యాలయంలో సైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఆపరేషన్ సిందూర్ నిస్సందేహంగా భారత్ చేపట్టిన అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్. వారు మా తలపై దాడి చేయడానికి ప్రయత్నిస్తే, మేము వారి ఛాతీపై దెబ్బకొట్టి పెద్ద గాయం చేశాం" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# సజ్జల భార్గవ్‌రెడ్డికి సుప్రీంకోర్టులో నిరాశ

- మొదటి పేజీ తరువాయి

ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టం కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. సజ్జల భార్గవ్‌రెడ్డి తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి మధ్యంతర బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అయితే, భార్గవ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు అందుబాటులో లేరని, అందువల్ల కేసును వాయిదా వేయాలని ఆయన తరపు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, సీనియర్ న్యాయవాది వాదనల నిమిత్తం కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఇదే సమయంలో, ఇది ఎస్సీ, ఎస్టీ కేసు కాబట్టి ట్రయల్ కోర్టునే ఆశ్రయించాలని సూచించింది. గతంలో ఈ కేసు విచారణ చేపట్టాలని సజ్జల భార్గవ్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఉన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టారు.

# యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ప్రపంచ సుందరీమణులు

- మొదటి పేజీ తరువాయి

ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈవో) భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సుందరీమణుల పర్యటన సందర్భంగా ఆక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్ దళాలు, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**పోచంపల్లిలో ఇక్కత్ కళావైభవం**

మరోవైపు, టూరిజం విలేజ్‌గా ప్రసిద్ధి చెందిన పోచంపల్లిని ఆఫ్రికా ఖండంలోని 25 దేశాలకు చెందిన మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. గ్రామానికి విచ్చేసిన ఈ విదేశీ అతిథులకు స్థానిక ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇక్కత్ చీరల విశిష్టతను, వాటి తయారీ విధానాన్ని సుందరీమణులు ఆసక్తిగా పరిశీలించారు. అంతేకాకుండా, కొందరు పోటీదారులు స్వయంగా మగ్గంపై చీరలు నేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా పోచంపల్లి చేనేత కళ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది.

# పీఓకేను అప్పగించకుంటే మరిన్ని యుద్ధాలు తప్పవు

- మొదటి పేజీ తరువాయి

పాకిస్థాన్‌లో తలదాచుకున్న వంద మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఈ ఆపరేషన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంతో ముగించలేదు. పీవోకేను భారత్‌కు అప్పగించాలని, ఉగ్రవాద కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని పాకిస్థాన్ ముందు భారత్ స్పష్టమైన ప్రతిపాదనలు ఉంచింది" అని వివరించారు. కశ్మీర్ వివాదంలో మూడో వ్యక్తి ప్రమేయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని అథవాలే తేల్చిచెప్పారు. "తూటాకు తూటాతోనే సమాధానం చెప్పడమనేది భారత విధానం. పీవోకే భారత్‌లో అంతర్భాగమని గతంలో పార్లమెంటు వేదికగా కూడా నేను స్పష్టం చేశాను. ఒకవేళ పాకిస్థాన్ దానిని అప్పగించకపోతే, దాన్ని తిరిగి మన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి మరిన్ని యుద్ధాలు చేయాల్సి ఉంటుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుత సున్నితమైన పరిస్థితులను విపక్షాలు రాజకీయం చేయవద్దని కూడా అథవాలే హితవు పలికారు.

## హైదరాబాద్, ముంబైలలో ఈడీ సోదాలు...

# రూ. 32 కోట్ల ఆస్తుల స్వాధీనం

**పెన్ పవర్ డెస్క్:** ముంబైకి చెందిన వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) పరిధిలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా గురువారం అధికారులు కీలక ముందడుగు వేశారు. ముంబై, హైదరాబాద్ నగరాలతో పాటు మొత్తం 13 ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ దాడుల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ప్రకటించింది. సుమారు రూ.9.04 కోట్ల నగదుతో పాటు, రూ.23.25 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ రూ.32 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ముంబైలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో ఈ అక్రమాలపై పలు కేసులు నమోదయ్యాయి. వీటి ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ఆక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా 2009 సంవత్సరం నుంచి అక్రమ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసినట్లు ఈడీ గుర్తించింది.

ఈ కుంభకోణంలో సీతారాం, అరుణ్ అనే వ్యక్తులు కీలక నిందితులుగా ఉన్నట్లు ఈడీ పేర్కొంది. కొందరు అవినీతి అధికారులతో వీరు కుమ్మక్కై, ప్రభుత్వ స్థలాల్లో కూడా చట్టవిరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి, అమాయక ప్రజలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో భాగంగానే వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగపు డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిందితుల ఇళ్ల నుంచి పెద్ద ఎత్తున నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ తమ ప్రకటనలో స్పష్టం చేసింది.

## భూ రికార్డుల ప్రక్షాళనకు కేంద్రం బృహత్ ప్రణాళిక... టెక్నాలజీతో సమగ్ర సర్వే

- మొదటి పేజీ తరువాయి

సర్వే, రీసర్వే చేపట్టనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని వెల్లడించారు. సరికాని, కాలం చెల్లిన భూ రికార్డుల వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్' కింద సర్వే/రీసర్వేపై జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో మంత్రి పెమ్మసాని ప్రసంగించారు. ఈ కార్యక్రమం కేంద్ర ప్రాయోజిత పథకమని, పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి నడుస్తుందని తెలిపారు. డ్రోన్లు, విమానాల ద్వారా ఏరియల్ సర్వేలు చేయడం వల్ల సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే కేవలం 10 శాతం ఖర్చుతోనే సర్వే పూర్తి చేయవచ్చని ఆయన వివరించారు. కృత్రిమ మేధ , జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ , అత్యంత కచ్చితత్వంతో పనిచేసే పరికరాలను ఈ సర్వేలో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం అమలులో రాష్ట్రాల సహకారం కీలకమని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, ధృవీకరణలను రాష్ట్రాలు నిర్వహిస్తుండగా, కేంద్రం విధాన రూపకల్పన, నిధులు, సాంకేతిక సహకారం అందిస్తుందని వివరించారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుండగా, మొదటి దశలో భాగంగా రూ.3,000 కోట్ల వ్యయంతో రెండేళ్ల వ్యవధిలో 3 లక్షల చదరపు కిలోమీటర్ల గ్రామీణ వ్యవసాయ భూముల్లో సర్వే చేపడతామని తెలిపారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ తో ఆధార్ నంబర్ల అనుసంధానాన్ని పూర్తి చేయాలని రాష్ట్రాలను ఆయన కోరారు. ఈ సంస్కరణ ద్వారా భూమి యాజమాన్యాన్ని ప్రత్యేక డిజిటల్ గుర్తింపుతో ముడిపెట్టవచ్చని, తద్వారా నకిలీలను అరికట్టి, అగ్రిస్టాక్, పీఎం-కిసాన్, పంటల బీమా వంటి ప్రయోజనాలను అర్హులకు నేరుగా అందించవచ్చని సూచించారు. రీసర్వే, డిజిటలైజేషన్, కాగిత రహిత కార్యాలయాలు, కోర్టు కేసుల నిర్వహణ, ఆధార్ అనుసంధానం వంటి సంస్కరణలు సమగ్రమైన, పారదర్శకమైన భూ పరిపాలన వ్యవస్థను సృష్టిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయి వాస్తవాలకు అనుగుణంగా రికార్డులు ఉన్నప్పుడే భూమి ఆర్థిక సామర్థ్యం పెరుగుతుందని మంత్రి పెమ్మసాని అన్నారు. దీనివల్ల బ్యాంకులు విశ్వాసంతో రుణాలు ఇవ్వగలవని, వ్యాపారవేత్తలు ధైర్యంగా పెట్టుబడులు పెట్టగలరని, రైతులు వ్యవసాయ మద్దతును పొందగలరని పేర్కొన్నారు. "వేగవంతమైన రహదారులు, స్మార్ట్ నగరాలు, సురక్షితమైన గృహాలు, స్థిరమైన వ్యవసాయం కావాలంటే, మనం భూమి నుంచే ప్రారంభించాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రామ్ ( కింద గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సర్వే, రీసర్వే అనే ముఖ్యమైన అంశం ఇప్పటివరకు కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే పూర్తయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ పరిపాలనాపరంగా, సాంకేతికంగా, ప్రజా భాగస్వామ్యంతో కూడిన భారీ కసరత్తు అని అన్నారు. అనేక రాష్ట్రాలు మ్యాప్ ఆధారిత ఉపవిభజనలు చేపట్టలేదని, ప్రాదేశిక రికార్డులను అప్ డేట్ చేయలేదని, దీనివల్ల ప్రస్తుత కాడాస్ట్రల్ మ్యాప్‌లు వాడుకలో లేకుండా పోయాయని తెలిపారు. "రాజకీయ సంకల్పం, బలమైన సమన్వయం లేకపోతే సర్వేలు వేగం కోల్పోయి అసంపూర్తిగా మిగిలిపోతాయని మా అనుభవం చెబుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. ఈ జాతీయ వర్క్‌షాప్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు, నిపుణులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిపక్షంలో ఉన్నప్పటి కసితో పనిచేయాలి

- మొదటి పేజీ తరువాయి

కార్యకర్తలకు సూచించారు. "ఒక్క పాఠశాలనూ మూసివేయడం లేదు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం" అని ఆయన అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేయలేని పనులను తమ ప్రభుత్వం 11 నెలల్లోనే చేసి చూపిందని, 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చామని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున కంపెనీలు వస్తున్నాయని, అనంతపురానికి రూ.22 వేల కోట్ల భారీ సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టు, విశాఖకు టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తున్నాయని, రాబోయే ఐదేళ్లలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, జనసేన పార్టీలతో కూటమి పటిష్టంగా ఉందని, నామినేటెడ్ పదవుల విషయంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని, కార్యకర్తల త్యాగాల వల్లే చారిత్రక విజయం సాధ్యమైందని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఆయన పునరుద్ఘాటించారు.

## మోదీ, నితీశ్... చాతనైతే నన్ను ఆపండి

- మొదటి పేజీ తరువాయి

పేరిట తలపెట్టిన ముఖాముఖి కార్యక్ర మానికి వెళుతున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల ఆటంకాలను అధిగమించి హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ, బీహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను పోలీసులు హాస్టల్ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిలువరించారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయినప్పటికీ, రాహుల్ గాంధీ పట్టువీడకుండా, పోలీసుల అడ్డంకులను దాటుకుని హాస్టల్‌లోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బీహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని "డబుల్ ఇంజిన్ ధోకాబాజ్ సర్కార్" (డబుల్ ఇంజిన్ మోసపూరిత ప్రభుత్వం) అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌లను ఉద్దేశించి రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. "నితీశ్ జీ, మోదీ జీ, ఆపగలిగితే ఆపండి. కులగణన తుఫాను సామాజిక న్యాయం, విద్య, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతోంది," అని ఆయన హిందీలో ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. "బీహార్ పోలీసులు నన్ను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారు నన్ను ఆపలేకపోయారు, ఎందుకంటే మీ (మైనారిటీ వర్గం) శక్తి నన్ను కాపాడుతోంది. దేశంలో కులగణన చేపట్టాలని మేము ప్రధాని మోదీకి చెప్పాం. మీ ఒత్తిడి వల్లే ప్రధాని మోదీ కులగణన ప్రకటించారు. మీ ఒత్తిడికి భయపడి ఆయన రాజ్యాంగాన్ని నుదుటిపై పెట్టుకున్నారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# "బీట్ ది హీట్ "థీమ్ తో స్వచ్ఛాంధ్ర,స్వచ్ఛదివస్ కార్యక్రమం

**కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ.పెన్ పవర్ మే 15 :**రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్వర్వులు, మార్గదర్శాకాల కనుగుణంగా మే నెల 3వ శనివారం జిల్లాలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని " బీట్ ది హీట్ " థీమ్ తో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం తీవ్ర ఉష్ణోగ్రతలు, హ్యుమిడ్ వాతావరణంతో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం సూచించిన వివిధ అంశాలతో ఈ నెల స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన తెలిపారు.ఇందులో భాగంగా వడగాడ్పులు,తీవ్ర ఉష్ణోగ్రతలకు సంబంధించి వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలపై ముందుగానే ప్రజలకు సమాచారం అందించి అప్రమత్తం చేయడం, పబ్లిక్ ప్రదేశాలలో త్రాగునీరు అందుబాటులో ఉంచుతూ వాటర్ ఏటిఎం లను ఏర్పాటు చేయడం, పట్టన ప్రాంతాలలోని ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి అర్బన్ ఫారెస్ట్ లను, రోడ్ల మార్జిన్ల వెంబడి నీడనిచ్చే చెట్లను పెంచి కూల్ పేవ్ మెంట్లను అభివృద్ధి చేయడం, ప్రజలు ఇంటి మిద్దెలపై మొక్కల పెంపకంతో రూఫ్ టాప్ గార్డెన్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించడం,ట్రాఫిక్ జంక్షన్లలో షేడ్ నెట్ ల ఏర్పాటు, చిన్నపిల్లలు, వృద్ధులను ప్రతికూల వేడి వాతావరణం నుండి కాపాడే జాగ్రత్తలను అందరూ పాటించేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం విస్తృత స్థాయిలో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్స్ అంశాలపై ప్రజలలో అవగాహన,ఆచరణ పెంపొందించాలన్నారు.ఈ నెల 3వ శనివారమైన 17వ తేదీ ఉదయం 8గంటల నుండి ఈ స్వచ్ఛతాదివస్ కార్యక్రమాలను అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ప్రజాభాగస్వామ్యంతో ప్రభుత్వ మార్గదర్శాలను పాటిస్తూ జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో ఉద్యమ స్ఫూర్తితో ముమ్మరంగా నిర్వహించాలని, చేపట్టిన కార్యక్రమాల ఫోటోలతో తమతమ లాగిన్ ద్వారా నివేదికలను విధిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు.

# జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మందపల్లికి 4 బంగారు పతకాలు

**అభినందించిన కలెక్టర్**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :** ఈనెల 3, 4 తేదీలలో ఎర్నాకులం, కేరళలో జరిగిన జాతీయ స్థాయి పాన్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్,పవర్ లిఫ్టింగ్ పోటీలలో కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డీపోకి చెందిన మందపల్లి శ్రీనివాసరావు 4 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు. వచ్చే జూన్ నెలలో బెంగళూరులో 40 దేశాలతో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే ఆసియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక కావడంతో జిల్లా కలెక్టర్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కాకినాడ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా



కలెక్టర్ షణ్మోహన్ ఆకాంక్షించారు.

## అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు
# కలిసిన కొండపల్లి రవి



టీ నర్సాపురం, పెన్ పవర్,మే 15:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్కాబ్ చైర్మన్ మరియు ఏలూరు డిసిసిబి చైర్మన్ గా నియామకం అయినా ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుని భీమడోలు క్యాంపు కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా కొండపల్లి రవి వైసిపి హయాంలో సొసైటిలు నిర్వీర్యం అవడమే కాకుండా వైసిపి నాయకులకు ఆదాయ వనరుగా మారి లెక్కలేని అవినీతి జరిగిందని వీటన్నింటి మీద విచారణ జరపాలని అదేవిధంగా టి నర్సాపురం సహకార సొసైటీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి పక్కదారి పట్టిన రైతుల డబ్బులను రికవరీ చేసి డిపాజిట్ దారులకు న్యాయం చేయాలని కోరడం జరిగింది.

# జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :** జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.
గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఏ.ఐ) , రెవెన్యూ, సర్వే, ఏపీఈపీడీసీఎల్, పోలవరం ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి 216 కాకినాడ – కత్తిపూడి, కాకినాడ పోర్టు – అచ్చంపేట, అచ్చంపేట – సామర్లకోట, వాకలపూడి – అన్నవరం వరకు నిర్మించనున్న జాతీయ రహదారులు, నిర్మాణ దశలో ఉన్న రహదారల పనుల పురోగతి, ఇతర భూసేకరణ, టెండర్లు ప్రక్రియలపై జిల్లా కలెక్టర్.. అధికారులతో చర్చించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినందున రెవెన్యూ, ఎన్.హెచ్.ఎ.ఐ ఇంజనీరింగ్ అధికారులు, సర్వే, విద్యుత్తు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ పనులను సకాలంలో పూర్తి చేసి టెండర్ల ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.
సమావేశంలో ఎన్.హెచ్.ఎ.ఐ పీడీ డీ.సురేంద్ర, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద, వివిధ మండలాల తహసీల్దార్లు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# కోర్టు ఆర్డర్ ను అమలు చేయాలి.

**కాంట్రాక్టు ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి.**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :**కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి నందు ఎఫ్ ఎన్ ఓ, ఎంఎన్ఓ, ఎలక్ట్రిషన్, ఫిట్టర్, ప్లంబర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి సెక్షన్స్ లో పనిచేసే కాంట్రాక్ట్ సిబ్బంది 2021 వరకు నక్షత్ర ఏజెన్సీ అనే కాంట్రాక్టు సంస్థ ద్వారా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారు.వీరిని 2021లో అర్థంతరంగా తొలగించారు. అనంతరం వీరు ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ముందు శిబిరం వేసుకుని పోరాటం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు.గౌరవ హైకోర్టు వారు ఈరోజు వీరిని విధుల్లోకి తీసుకోవాలని ఉత్తరవులు జారీ చేశారు.ఈ ఉత్తర్వులు కాపీని తీసుకుని సిఐటియు నాయకత్వం ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులందరూ కలిసి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణలు మాట్లాడుతూ హైకోర్టు వారు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దాదాపు నాలుగేళ్ల కాలం నుంచి ఈ ఉద్యోగులందరూ ఉద్యోగాలు లేకుండా రోడ్డుపై ఉన్నారని కోర్టు ఆర్డర్ నైనా పరిగణలోకి తీసుకుని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. విధుల్లోకి తీసుకుని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు



అందించడానికి వీరిని ఉపయోగించాలని కోరారు. ఇప్పటికే ఆసుపత్రిలో ఈ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉందని వీరిని విధుల్లోకి తీసుకుంటే రోగులకు మరిన్ని సేవలు అందుతాయని అన్నారు. విధుల్లోకి తీసుకునే అంతవరకు పోరాటం మాత్రం కొనసాగుతుందని తెలియజేశారు. వినతి పత్రం తీసుకున్న సూపర్డెంట్ డాక్టర్ విటల్ మాట్లాడుతూ కోర్ట్ ఆర్డర్ కాపీ మాకు కూడా అందిందని మీరు ఇచ్చేటటువంటి వినతి పత్రాన్ని డిఎంఏ వారికి పంపిస్తామని వారి నుంచి ఏ విధమైన డైరెక్షన్స్ వస్తే దానికి అనుగుణంగా మేము వీరిని విధుల్లోకి తీసుకోవడానికి చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగులందరూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాయుడు,పిడుగు గంగాధర రావు,దయానంద్,దుర్గ క్ష్మి,అరుణ,వసంత,గోవిందు, భవాని,రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిఈఓసి సమర్ధత, సంసిద్ధతలను పరిశీలించేందుకు నేడు మాక్ డ్రిల్

**జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :**అగ్ని ప్రమాదాలు సంభవించడం , భవనాలు కూలడంవంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా రక్షణ, సహాయ యంత్రాంగ సంసిద్ధత పరిశీలనకు శుక్రవారం ఉదయం కలెక్టరేట్ ప్రాంగణంలో మాక్ డ్రిల్ నిర్వహణకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా ఎమర్జెన్సీ ఆపరేషన్స్ కమిటీ సమావేశం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ సూచనల కనుగుణంగా ఆకస్మికంగా భవనాలు కుప్పకూలడం, అగ్ని ప్రమాదాలు,ఏసీలు,ఫ్రిజ్జుల వల్ల ప్రమాదాలు జరిగినట్లయితే సివిల్ డిఫెన్స్ ప్రిపేర్డ్ నెస్ వ్యవస్థ ద్వారా పౌర రక్షణకు తక్షణం స్పందించేందుకు వివిధ శాఖల సమన్వయంతో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యం, రవాణా, పౌరసరఫరాలు,విద్యుత్, పశు సంవర్ధక,పంచాయితీ,విద్యా శాఖల సమన్వయంతో ఈ డిఈఓసి పనిచేస్తుందని,విపత్తు సమయాల్లో చేపట్టవలసిన ప్రామాణిక రక్షణ,సహాయక చర్యలను ఆయా శాఖలకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ఈ మేరకు భవనాలు కులడం, అగ్ని ప్రమాదాలు,ఏసీలు, ఫ్రిజ్జుల వల్ల ప్రమాదాలు జరిగినపుడు తక్షణ స్పందించడంలో డిఈఓసి సమర్ధత, సంసిద్ధతలను పరిశీలించేందుకు ఈ నెల 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో సమన్వయ శాఖల ఆధ్వర్యంలో మాక్ డ్రిక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నమని అందుకు సంబంధిత శాఖలు సంసిద్ధంగా ఉండాలని డిఆర్ఓ అన్నారు. ఈ మాకు డ్రిల్ లో ఒక సీన్ క్రియేట్ చేసి సహజంగా జరిగిన సంఘటనలో అగ్నిమాపక, పోలీస్ ,



రెవెన్యూ ,ఎన్ డి ఆర్ ఎఫ్ టీములు ఏ విధంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటారో కళ్లకు కట్టినట్లు చూపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మాక్ డ్రిల్ లో భాగంగా నిర్వహించే వివిధ అంశాలపై ఆయా శాఖలకు ఆయన సూచనలు జారీ చేసారు. మాక్ డ్రిల్ లో పరిశీలించిన అంశాల ఆధారంగా రక్షణ, సహాయ వ్యవస్థలను మరింత దృఢం చేయడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు.ఈ సమావేశంలో డిఈఓసి నోడల్ అధికారి,లాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్డిసి డి.భారతి, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారి సుబ్బారావు, డిపిఓ రవికుమార్ , డిటిసి కె.శ్రీధర్, పశుసంవర్ధక శాఖ డిడి వెంకటేశ్వరరావు,ఎస్డిఆర్ఎఫ్,ఎన్ డిఆర్ఎఫ్ ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 18 న కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడు



**శాసనసభ్యులు వనమాడి కొండబాబు**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :**మే 18 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి స్థానిక సూర్య కళామందిరం నందు పండగ వాతావరణంలో కాకినాడ సిటీ నియోజకవర్గ మినీ మహానాడు సమావేశం నిర్వహించనున్నట్లు కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.సూర్య కళామందిరం నందు నిర్వహించు కాకినాడ సిటీ నియోజకవర్గం మినీ మహానాడు కడప నందు 27, 28, 28 తేదీలలో నిర్వహించు మహానాడు కార్యక్రమాలపై గురువారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్వగృహం నందు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జన్మదినం పురస్కరించుకొని ప్రతి ఏటా మే 26, 28, 29 తేదీలలో రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతం నందు అత్యంత వైభవంగా మహానాడు నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా మహానాడుకు ప్రతి నియోజకవర్గము నందు మినీ మహానాడు నిర్వహించడం జరుగుతుందని,మినీ మహానాడు సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలపై చర్చించి తీర్మానాలు చేయడం జరుగుతుందని, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు,గదుల సాయిబాబా,బచ్చు శేఖర్,పలివెల రవి అనంత కుమార్,చింతా పేర్రాజు,పంతాడి రాజు, అంబటి చిన్న, తుమ్మల సునీత, పీర్ల లక్ష్మీ ప్రసన్న,రాణి,బంగారు సత్యనారాయణ,గాది శివరామకృష్ణ, పోలిపల్లి జగన్, రెడ్నం సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ పేద కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**శాసనసభ్యులు వనమాడి కొండబాబు**

**కాకినాడ.పెన్ పవర్ మే 15 :**వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన సుమారు 4 లక్షల రూపాయల చెక్కులను శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్వగృహం నందు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విప్పర్తి రఘువీర్, వాడముదుల సత్యవతి, అంబటి వినయ్ కుమార్, కర్రీ భైరవ స్వామి, బలసడి మల్లికార్జున్ లకు అందజేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క పేద కుటుంబానికి మెరుగైన వైద్య సదుపాయం అందించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆర్తుల నిరంతర వైద్య సేవ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఉండి అందించు ఆర్థిక సహాయం పేద వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కొండబాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘాన్ని నాగూర్, గాది శివరామకృష్ణ, మేడిశెట్టి చిన్ని, నర్వ చంద్రశేఖర్, తుమ్మల సునీత, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ జన్మదిన వేడుకలు

**అల్లవరం, పెన్ పవర్,మే15:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ క్యాంప్ కార్యాలయం నందు ఇజ్రాయిల్ పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగినవి. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ కు రాజకీయ నాయకులు, పార్టీ అభిమానులు, వివిధ డిపార్ట్మెంట్స్ కు చెందిన ఉద్యోగస్తులు దుస్సాలువతో, భారీ గజమాలతో ఇజ్రాయిల్ దంపతులను సత్కరించి,భారీ కేక్ కటింగ్ చేయించి, స్వీట్స్ తినిపించి, భారీ బాణాసంచా కాల్చి అత్యంత వైభవంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం పట్టణము చెందిన ఓల్డేజ్ హోం నందు బొమ్మి నరసింహ మూర్తి మంగాయమ్మ ట్రస్ట్ ద్వారా ఓల్డ్ ఏజ్ హోం లో ఉన్న వారందరికీ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనేకమంది ఇజ్రాయిల్ భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని, మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని దీవించి ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో అమలాపురం వైఎస్ఆర్సిపి పార్టీ కోఆర్డినేటర్ పిలిపే శ్రీకాంత్, చెల్లుబోయిన శ్రీనివాసరావు,అల్లవరం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఒంటెద్ది వెంకయ్య నాయుడు, కొనుకు బాపూజీ,మట్టపర్తి నాగేంద్ర,



వేగిరాజు సాయిరాజు, గువ్వల రాజేష్, వంగా గిరిజాకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ,వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు,ఉద్యోగస్తులు,ఇజ్రాయిల్ అభిమానులు పాల్గొన్నారు.

## పేదలకిచ్చిన హామీలు అమలు చేయాలి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మే 15:**ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి పేదలకు న్యాయం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లి సిపిఐ శాఖ మహాసభ పూడి శ్యామల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలైన సందర్భంగా దేశ మంతట ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడు తున్నాయనారు. ఈ 100 సంవత్సరాల కాలంలో కార్మికులకు, కష్టజీవులకు బడుగు బలహీన వర్గాల వారి తరఫున ఎన్నో పోరాటాలు చేసిందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని కమ్యూనిస్టు పార్టీ పెద్ద పోరాటం నిర్వహించిందన్నా రు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అలుపెరుగని ఉద్యమం చేసిందన్నారు. రజాకర్లకు వ్యతిరేకంగా గొప్ప ఉద్యమం చేసిందని, 4వేల మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పేదల కోసం ఉద్యమాలు చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి పాలన చేస్తునాయని చెప్పారు. సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఈ రాష్ట్రంలో ఎంతోమంది బడుగు బలహీన వర్గాల వారికి, పేదలకు బంజరు పొలములకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించిన ఘనత సిపిఐ కి ఉందన్నారు. విశాఖ ఉక్కు కోసం 30 మంది పైగా యువకులు ప్రాణత్యాగం చేశారన్నారు. భూమి కోసం భుక్తి కోసం చారిత్రాత్మకు పోరాటాలు నిర్వహించింద న్నారు. ఈనెల 20న జరిగే కార్మిక సమ్మె ను జయప్రదం చేయాలన్నారు. వేసవికాలంలో గంజి కేంద్రాలు ఏర్పాటుచేసి దాహార్తి చేర్చడంలో ఎంతో కృషి చేసిందన్నారు. విపత్తుల సమయంలో పార్టీ ముందుండి అన్ని రకాలుగా సహాయాలు అందించిందని అటువంటి కమ్యూనిస్టు పార్టీని పేదలందరు ఆదరించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు ఉద్యమాలో మమేకంకావాలని ప్రజలు కోరారు. ఈ సభలో వెంకట్రావు, వడ్డాది మేరీ , పూడి సుబ్బారావు, గొంగాడ సత్యనారాయణ, పూడి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇటీవల జరిగిన భారత్, పాకిస్తాన్ యుద్ధంలో మరణించిన భారత జవాన్లకు నివాళులర్పిం చారు.

## ఉక్కపోతకు వర్షంతో ఉపశమనం



వై రామవరం, పెన్ పవర్ మే 15: గురువారం ఉదయం నుండి ఉక్క పోత తో అల్లాడిపోయిన జనానికి మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురవడంతో ఉపశమనం కలిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత మూడు రోజుల నుండి ఊరిస్తూ వస్తున్న వర్షం గురువారం మధ్యాహ్నం నుండి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసిందని అన్నారు. భారీ వర్షం వల్ల విద్యుత్ సరఫరా లోనూ, బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ పోవడంతో సెల్ ఫోన్లు పనిచేయలేదని తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు -ఎస్సై డి. రామ్ కూమార్



**సీతానగరం, పెన్ పవర్, మే15:**ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని సీతానగరం మండలం పోలీసులు హెచ్చరించారు. ఒకటి రెండు సార్లు తప్పు చేస్తే అపరాధ రుసుములు విధిస్తామన్నారు, అప్పటికి మారకుండా ఒకే తప్పు పదేపదే చేస్తే కఠినంగా శిక్షిస్తామని సీతానగరం ఎస్సై డి. రామ్ కుమార్ పేర్కొన్నారు, గురువారం నాడు ఆయన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెంట్ లైసెన్స్ గురించి వివరించారు, చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే సీరియస్ గా పరిగణిస్తామని తల్లిదండ్రులు కూడా శిక్షకారులు అవుతారని తెలిపారు. దీని దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంతో పాటు మద్యం సేవించి ఉండకూడదన్నారు, అలాగే లైసెన్స్ కచ్చితంగా ఉండాలన్నారు. త్రిబుల్ రైడింగ్ చేసిన కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు, వీటిని గుర్తించి వాహనదారులు సహకరించాలని నిబంధనలు పాటించాలని రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వాహనాలు నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్తగా నడపాలని, ముఖ్యంగా మత్తు పదార్థాలు, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు.

## ఘనంగా సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు





**జగ్గంపేట(గండేపల్లి), పెన్ పవర్, మే 15:** గండేపల్లి మండలంలోని మల్లేపల్లి నీలికుండీలతోటలో కోరిన కోర్కెలు తీర్చే గ్రామదేవతగా వెలసిన సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు జాజిమొగ్గల సూర్యనారాయణ, కంచెర్ల వెంకటేశులు, వల్లభశెట్టి సత్తిబాబు, జాజిమొగ్గల సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో జరిపారు. డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలు, బాణాసంచా పేల్చుకుంటూ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నేర్చుకున్న చిన్నారులచే కోలాట ప్రదర్శనలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## నిబంధనల ప్రకారమే హౌసింగ్ కాలనీలను సకాలంలో నిర్మించాలి





**వై రామవరం,పెన్ పవర్, మే 15:** మండలంలో మంజూరైన హౌసింగ్ కాలనీలను నిబంధనల ప్రకారం సకాలంలో నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు.

ఎంపీపీ కే ఆనందరావు అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. పార్టీలకతీతంగా సభ్యులందరూ పీఎం జన్ మన్ లో మంజూరైన హౌసింగ్ కాలనీలను నిబంధనల ప్రకారం, సకాలంలో నిర్మించాలన్నారు. ఒక కాంట్రాక్టర్ వర్క్ తీసుకుని, వేరొక కాంట్రాక్టర్కు అప్పగిస్తున్నారని దీనివల్ల నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని సభ్యులు ఆరోపించారు. ప్రతి గ్రామంలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో రహదారుల నిర్మాణాల అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారుల ను డిమాండ్ చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. మండలం అప్పర్ పార్ట్ ఏఈ( ట్రైబల్ వెల్ఫేర్)పై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు జోగిరాజు, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కరకా వెంకటరమణ, తాసిల్దార్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి జిల్లాల ప్రేక్షకుల ఆదరణ మరువలేనిది

- జగ్గంపేటలో సందడి చేసిన శుభం చిత్ర బృందం





**జగ్గంపేట, పెన్ పవర్, మే 15:** గోదావరి జిల్లాల ప్రేక్షకుల ఆదరణ మరువలేనిదని శుభం చిత్రబృందం హర్షితారెడ్డి, శ్రియ, శ్రీనివాస్ గౌరెడ్డి, శ్రావణి లక్ష్మి, చరణ్ పెర్రి, షాలిని కొండేపూడి, వంశీధర్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల, ఆర్య అన్నారు. ప్రముఖ సినీనటి సమంత ప్రొడ్యూసర్ గా తీసిన తొలిచిత్రం శుభం సక్సెస్ మీట్ లో భాగంగా గురువారం జగ్గంపేట ఎస్వీఎఫ్ నాగేశ్వర థియేటర్ కు చిత్ర బృందం విచ్చేశారు. థియేటర్ కు వచ్చిన చిత్రబృందానికి వీరాంజనేయ ఫిల్మ్స్ అధినేతలు కొత్త శివ, బూర్లు సాయి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రేక్షకులతో కలిసి వారు శుభం సినిమా చూసి ఆడిపాడారు. అనంతరం బృందం మాట్లాడుతూ చిత్రాన్ని ఇంత విజయవంతం చేసిన ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. అందరూ కొత్త నటులమైనప్పటికీ ఎంతగానో ఆదరించారన్నారు. ప్రేక్షకుల ఆదరణ ఉంటే ముందుముందు మరెన్నో చిత్రాలు తీయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సినీబృందంతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల దరఖాస్తులు స్వీకరించాలి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,మే15:** వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు అంతా సమన్వయంతో లబ్ధిదారుల నుంచి స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని తహశీల్దార్ సునీల్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున ప్రభుత్వం స్థలాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు . గతంలో ఎన్నడూ స్థలాలు తీసుకోని వారు అర్హులన్నారు. గతంలో స్థలాలు తీసుకుని ఇల్లు నిర్మించని వారిని రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అర్హులను గుర్తించి ప్రభుత్వానికి సిక్స్ స్టెప్ వెలివేషన్ ప్రకారం గుర్తిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, హౌసింగ్, రెవిన్యూ సిబ్బంది, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏజెన్సీలో అంతరిస్తున్న పశు సంపద -అక్రమ రవాణాపై గిరిజనుల ఆవేదన

**రాజవొమ్మంగి పెన్ పవర్ మే 15:** ఒకప్పుడు పాడి పశువులతో కళకళలాడిన ఏజెన్సీ ప్రాంతంలో పశు సంపద అంతరించిపోతోంది. గిరిజన రైతులు తమ కష్టానికి తగిన విలువ లేకపోవడంతో పశువులను అమ్ముకునే దుస్థితికి చేరుకున్నారు. పశువులే జీవనాధారమైన ఈ ప్రాంతంలో దళారులు గిరిజనుల నుండి పంటలతో పాటు పశువులను కూడా మైదాన ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలోని ఫారెస్ట్ చెక్ పోస్టులు, పోలీస్ స్టేషన్లను దాటుకుని పశువుల అక్రమ రవాణా ఎలా సాగుతోందో అందరికీ తెలిసిన విషయమేనని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “ముడుపు కడితే ఏ పోస్ట్ అయినా తెరువాల్సిందే” అని అక్రమ రవాణాదారులు ధైర్యంగా చెబుతున్నారని వారు వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు పశువుల అక్రమ రవాణాపై దృష్టి సారించాలని గిరిజనులు వేడుకుంటున్నారు. లేనియెడల ఏజెన్సీ ప్రాంతంలో పశువులు కేవలం పుస్తకాల్లో మాత్రమే మిగిలిపోతాయని, కంటికి కనిపించకుండా కనుమరుగవుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. పశు సంపదను కాపాడి, తమ జీవనోపాధిని నిలబెట్టాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



# అపర భగీరధుడు సర్ అర్ధర్ కాటన్-ఎమ్మెల్యే వేగుళ్ల




**మండపేట. పెన్ పవర్.మే 15 :**లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాలు దేశానికే అన్నపూర్ణగా పేరు తెచ్చిన ఘనత సర్ అర్ధర్ కాటన్ కే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సర్ ఆర్ధర్ కాటన్
జయంతి వేడుకలను మండపేట బైపాస్ రోడ్డు లో వల్లూరి పాపారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిధిగా పాల్గొని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేగుళ్ళ మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టితో అతలాకుతలమవుతున్న గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మార్చిన ఘనుడు కాటన్ అని అన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించి గోదావరి వాసుల మదిలో అజరామరంగా నిలిచిపోయారన్నారు. ఆరోజుల్లో ఆయన చేతి కర్రతో గీచిన గీతలు డెల్టా కాలువలయ్యాయన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి గోదావరి జిల్లాలకు పునర్జీవం ప్రసాదించిన అపర భగీరధుడు గా కాటన్ చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండపేట మండల అధ్యక్షులు యరగతపు బాబ్జి, కాటా గోపి, చుండ్రు అగస్త్యరాజు, వల్లూరి వీరవెంకట సత్యనారాయణ, వల్లూరి సత్యనారాయణ, మెర్ల అబ్బు, రెడ్డి భాస్కరరావు, పుల్లేటికుర్తి ఆనంద్, యరమాటి సత్యనారాయణ, యార్లగడ్డ శ్రీనివాస్, వల్లూరి విజయగోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల ఆసక్తి కలిగించే కార్యక్రమాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, మే 15:**వేసవి కాలంలో విజ్ఞానంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా మే 1 నుంచి మే 30 వరకు వివిధ క్రీడా అంశాల్లో 50 క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో క్రీడా శిక్షకులకు కిట్లు అందచేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ జిల్లా క్రీడా సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్రీడా అంశాల్లో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా క్రీడల్లో ప్రతిభను మెరుగు పరుచుకోవాలన్నారు. శిక్షకులకు రూ.5,000 విలువ చేసే క్రీడా సామగ్రి, గౌరవ వేతనం రూ.1500, ఇతర ఖర్చుల కోసం రూ.500 అదనపు ఖర్చును వారికి అందజేయడం జరిగిందన్నారు. క్రీడల్లో మెలుకువలు నేర్పుతూ వారి యొక్క భద్రత, ఇతర సదుపాయాలు కల్పించే విధంగా క్యాంపు నిర్వహించాలని తెలియజేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 15 క్రీడా అంశాలలో మొత్తం 50 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సాధికారిత అధికారి డి.ఎమ్.ఎమ్ శేషగిరి తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం అథ్లెటిక్స్ 2, బాల్ బ్యాట్మెంటన్ 2, బాస్కెట్ బాల్ 8, బాక్సింగ్ 4, చెస్ 1, క్రికెట్ 3, ఫుట్బాల్ 5, హ్యాండ్ బాల్ 2, జూడో 3, కరాటే 3, కబడ్డీ 3, టైక్వాండో 3, వాలీబాల్ 6, వెయిట్ లిఫ్టింగ్ 1, యోగ 4 కిట్ లు అందచేశామన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, మే 15:**ఆరోగ్యకర సమాజం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో రూ.1,25,000 విలువ చేసే సీఎం సహాయ నిధి(ఎల్ఓసి) చెక్కులను లబ్దిదారునకు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో ఇంత వరకు 85 మందికి కోటి 47 లక్షల రూపాయలు మేర సీఎం సహాయ నిధి ద్వారా ఆర్ధిక సహాయం అందచేశామన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. గత పాలకులు ఇటువంటి వారి విషయంలో నిర్లక్ష్యం వైఖరి చూపించారన్నారు. ఇంకా నగరంలో సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్న వారు 82 మంది ఉన్నారని, అర్హత కలిగిన అందరికి రెండు నెలల్లోనే సి ఎమ్ ఆర్ ఎఫ్ నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిని 15 రోజులకు ఒకసారి సందర్శించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి నేలకొరిగిన భారీ వృక్షం.



**అడ్డతీగల,పెన్ పవర్, మే 15:** అడ్డతీగల మండలం చిన్న ఒడిసకర్ర వద్ద గురువారం కురిసిన భారీ వర్షానికి భారీ వృక్షం ఆర్. అండ్. బి రోడ్డుకు అడ్డంగా నేల కూలింది. దీంతో వై.రామవరం- అడ్డతీగల ప్రధాన రహదారిలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. భారీ ఈదురు గాలులు కి తోడు వర్షం కురవడంతో ఈ వృక్షం రోడ్డుకి అడ్డంగా పడిపోవడంతో సుమారు మూడు గంటల పాటు రాకపోకలకు భారీ అంతరాయం కలిగింది అని గ్రామస్తులు చెప్పారు. గ్రామస్తులు సహాయ సహకారాలతో, ఆర్.అండ్. బి సిబ్బంది. అటవీ సిబ్బంది వృక్షాన్ని తొలగించే పనులు చేపట్టారు.

## 17న జనార్ధన స్వామి ఆలయ భూముల కౌలు వేలం.



**ఆలమూరు, పెన్ పవర్,మే15:**ఆలమూరులో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయ భూములు కౌలు వేలం ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు. 2025-26 నుంచి 2027-28 సంవత్సరాలకు మూడేళ్లు కౌలు వేలం నిమిత్తం ఈనెల 17న జనార్ధన స్వామి ఆలయ వద్ద ఉదయం 10 గంటలకు జనార్ధన స్వామి భూములకు, అలాగే 11 గంటలకు విక్రమ భట్టీశ్వర స్వామి ఆలయ భూములు, 12 గంటలకు చండి బైరవస్వామి భూముల కౌలు వేలం జరుగుతుందని ఆయన వివరించారు. వేలంలో పాల్గొనేందుకు ముందుగా రూ.5వేలు ధరావత్తు చెల్లించి వేలంపాటలు పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. కౌలు వేలంలో దక్కించుకున్న రైతులు మూడేళ్లపాటు కౌలు చేసుకోవచ్చునని సత్యనారాయణ తెలిపారు. పూర్తి వివరాలకు ఈ క్రింది 9177727320ను సంప్రదించవచ్చునని ఆయన వివరించారు.

## కాటన్ సేవలు గుర్తు ఉండిపోతాయి.కామన.



**మండపేట. పెన్ పవర్.మే 15 :**సర్ ఆర్థర్ కాటన్ దొర ఈ ప్రాంతానికి చేసిన సేవలు ఎప్పటికీ గుర్తు ఉండిపోతాయని అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకర్ రావు అన్నారు. పేర్కొన్నారు. కామన ఆధ్వర్యంలో ఘనంగా కాటన్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఎర్ర మట్టిలో పెరుగు కలుపుకుని తినే దౌర్భాగ్య దుర్భర పరిస్థితుల నుంచి రాష్ట్ర ధాన్యాగారాలు ఉభయ గోదావరి జిల్లాలను తీర్చిదిద్దిన ఘనత కాటన్ మహాశయునికే దక్కుతుందని అన్నారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాల ప్రజలు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సమృద్ధిగా ఉన్నారంటే అందుకు కారణం కాటన్ చేసిన కృషి అని పేర్కొన్నారు. కాటన్ మహాశయుని ఇక్కడి ప్రజలంతా స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కాటన్ చిత్రపటానికి కామన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాడిశెట్టి సత్యనారాయణ, కొడవళ్ళ వెంకట సుబ్బారావు, గంధ్రుతుల రామచంద్రరావు, వల్లభదాసు చిన్న, మగ్గం జాకాపరాజు, గేదెల శ్రీనివాస్, కుచ్చు బాబి, కొండ సతీష్, అందుకూరి సాయి, కాకి సూరిబాబు, వాసిరెడ్డి బాబురావు, అలమండ సూరిబాబు, పర్వతన వీర వెంకట సత్యనారాయణ చౌదరి, ముగ్గుల శ్రీనివాస్, ఎన్ ఉమామహేశ్వరరావు, అందుకూరి చెన్న, ఏ సత్తిబాబు, కే సింహాచలం, పి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తూర్పులంక లో పిడుగుపాటుకు ఇల్లు దగ్ధం

- పూర్తిగా నిరాశ్రయులైన కుటుంబం



**అల్లవరం, పెన్ పవర్, మే 15:**పిడుగుపాటుకు ఇల్లు పూర్తిగా దగ్ధమైన సంఘటన మండలంలోని తూర్పులంక గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే తూర్పులంక గ్రామంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో మంద సత్యనారాయణ ఇంటిపై పిడుగు పడి ఇల్లు పూర్తిగా కాలిపోయింది పిడుగు పడిన సమయంలో సత్యనారాయణ సోదరుడు ఇంట్లోనే ఉన్నారు స్థానికుల సహాయంతో బయటకు తీసుకు వచ్చారు ఎలాంటి ప్రాణస్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.అనంతరం స్థానికులు అగ్నిమాపక కేంద్రం కు సమాచారం ఇచ్చారు ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు అదుపు చేశారు. ఒకానొక సమయంలో గ్యాస్ సిలిండర్ ఇంట్లో పేలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు ఇంట్లో ఉన్న సామాన్లు అన్నీ కాలిపోవడంతో కట్టు బట్టలతో మిగిలామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

## వాడపల్లి వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి 1,28,000 రూ, విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:** కోనసీమ తిరుమల వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న చందన స్వరుపుడు వెంకటేశ్వర స్వామి అలివేలుమంగ పద్మావతి సమేతంగా కొలువైయున్న స్వయంభు క్షేత్రానికి దూర ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని నిలువెత్తు దర్శనం పొందుతున్నారు. గురువారం అమ్మవారు వసంత మండపంలో అష్టోత్తర పూజలు, నిత్య కళ్యాణం లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం భవన నిర్మాణానికి , అమలాపురం నికి,చెందిన కంచర్ల నాగ వీర వెంకట సత్యనారాయణ సూర్యలక్ష్మి దంపతులు అన్నదాన భవన నిర్మాణానికి 1,28,000 రూ,విరాళంగా అందజేశారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రోత్సవాలతో ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు వేడుకలు




ఉపాధి హామీ శ్రామికులు సమక్షంలో బండారు శ్రామికులు



**ఆలమూరు, పెన్ పవర్,మే15:**కొత్తపేట నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా వ్యవహరిస్తూ, మానవత్వం, మంచితనానికి మారుపేరుగా మన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిలిచారని, ఉపాధి హామీ శ్రామికులు, కూటమి నాయకులు వ్యాఖ్యానించారు. గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా ఆలమూరు మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు, ఉపాధి హామీ శ్రామికుల సమక్షంలో సత్యానందరావు జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎమ్మెల్యే సత్యానందరావు మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని నాయకులు గుర్తు చేశారు. కొత్తపేట అభివృద్ధి ప్రదాతగా, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో గ్రామాలన్నీ కళకళలాడేలా చేసిన ఘనత సత్యానందరావు సొంతమని వారు అన్నారు. భారీ కేకును కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసి శ్రామికుల, బాటసారుల దాహార్తిని తీర్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

## తూనికలు కొలతల్లో పారదర్శకత పాటించాలి.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 15:** తూనికలు కొలతల్లో పారదర్శకత పాటించాలని పెద్దాపురం డివిజన్ వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు భళ్ళమూడి నారాయణమూర్తి అన్నారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాలలో భాగంగా స్థానిక ధ్యాన మందిరంలో ఏలేశ్వరం మర్చంట్ అసోసియేషన్ గురువారం ఏర్పాటుచేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో నారాయణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాపార సంస్థలు, చిన్న పెద్ద వ్యాపారులు తుకాలు కొలతలలో పారదర్శకంగా ఉండాలని అన్నారు. మెట్రాలజీ ఇన్స్పెక్టర్ వి మోహన్ మాట్లాడుతూ వేయింగ్ మిషన్లు ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలని, ప్యాకింగ్ ప్రోడక్ట్స్ లో తేడా రాకుండా చూసుకోవాలని, తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం వివిధ వర్తక సంఘాల వ్యాపారులు పాల్గొన్నారు.

## కాటన్ దొరకు బీజేపీ నాయకులు ఘన నివాళి



**మండపేట. వెన్ పవర్.మే 15 :**అపర భగీరథుడు, నీటి భద్రతకు ప్రాణం అర్పించిన మహామనిషి జనరల్ సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతిని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాపేశ్వరం లాకులు సమీపంలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ అధికారిగా పని చేసిన కాటన్ దొర గోదావరి జిల్లాలో నీటిపారుదల రంగాన్ని అభివృద్ధి చేసి లక్షలాది ప్రజల జీవితాల్లో వెలుగు నింపారు. గోదావరి డెల్టాలో ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం ద్వారా వరద ముంపును తగ్గించి సాగునీటి కల్పనకు విస్తృత అవకాశాలను కల్పించారన్నారు.

గోదావరి ప్రజల గుండెల్లో ఆయన ఎప్పటికీ నిలిచి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యులు వల్లభనేని రవీంద్రబాబు, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, మద్దుల సుబ్బారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి జగతా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

# చేంజెస్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై కళాజాతాల ద్వారా అవగాహన



కాకినాడ. పెన్ పవర్ మే 15 :హెచ్ఐవి ఎయిడ్స్ లపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు నూతన ఒరవడికి చేంజెస్ సంస్థ శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిఎల్ఎటివో రోనంకి రమేష్ ఆదేశాలతో కెవిఆర్ శైలజ( సిపిఎం) చేంజెస్ కాకినాడ సంస్థ కే పుష్ప కుమారి ఆధ్వర్యంలో పిఠాపురం సాలిపేట మంగయ్యమ్మ పేట మార్కెట్ ప్రాంగణంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది? ఎలా వ్యాపించదు సుఖ వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి కండోమ్ వల్ల ఉపయోగాలు అనే అంశాలపై విస్తృతస్థాయి ప్రచారం జరపడం జరిగింది. ఆరోగ్యకర విషయాల పట్ల అవగాహన కల్పించడానికి కళాజాతర ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూపిహెచ్సీ వైద్య అధికారులు జయరాం వినయ్ ఐసీటీసీ కౌన్సిలర్ లక్ష్మి ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గ భవాని ఏఎన్ఎం శ్రీలక్ష్మి చేంజెస్ కాకినాడ సంస్థ సిబ్బంది శివ శ్రీదుర్గ నాగ దుర్గ సరోజ నారాయణ గౌరీ గాయత్రి సుశీల నటరాజ నిలయ చలనచిత్ర కళా ప్రదర్శన కమిటీ తోట పవన్ కుమార్ హర్షవర్ధన్ రాణి రాజు కళాజాతర బృందం వారు ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని అధికారులు అభినందించారు.

# భక్తులు భద్రత దృష్ట్యా వెంకన్న సన్నిధిలో బిడి టీం తో చెకింగ్





ఆత్రేయపురం పెన్ పవర్ మే 15: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న చందన స్వరూపుడు,వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ పద్మావతి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలను కూడా వేలాది గా భక్తుల తరలివచ్చిన స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయానికి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో గురువారం ఆలయ సన్నిధిలో భక్తుల భద్రత దృష్ట్యా ఆత్రేయపురం ఎస్సై ఎస్. రాము ఆధ్వర్యంలో బిడి టీం తో ఆలయమంత తనిఖీ నిర్వహించారు. భక్తులు సంఖ్య దిన దినము పెరగడంతో వారి భద్రత దృష్ట్యా బిడి టీం తో తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

# జగన్నాథగిరిలో పిడుగుపాటు కవులు రైతు మృతి

కాజులూరు, పెన్ పవర్,మే 15:మండల పరిధిలో జగన్నాథగిరి సమీపంలో పిడుగు పడి కౌలు రైతు మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం పెనుమల్ల నుండి కాపవరం వెళు ్తండగా భారీ వర్షం రావడంతో జగన్నాథగిరి వద్ద పిడుగు పడి కౌలు రైతు బక్కే బాలకృష్ణ ఒక్క సారిగా కుప్పకూలి పోయాడు.మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక వీఆర్వో ఈశ్వరరావు,పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మృతుడు కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వ్యక్తి, అత్తవారిది రామచంద్రపురం మండలం, కాపవరం గ్రామంగా తెలిపారు.అయితే ఐదేళు ్లగా అత్తారింటివద్ద ఉంటున్నాడు. పెనుమళ్ళ గ్రామానికి చెందిన సలాది రాంబాబు వద్ద కొంత పొలం కౌలు చేస్తున్నారు.పొలంపని నిమిత్తం పెనుమళ్ళ వచ్చి కాపవరం ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో మృత్యువు పిడుగు రూపంలో వెంటాడింది.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు స్థానికులు మీడియాకు తెలియజేసారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు.



## 65 వార్డ్ నూతన కమిటీ ఎంపిక



గాజువాక :పెన్ పవర్ ,మే 15 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు గాజువాక నియోజకవర్గం పరిశీలకుడు %వీ.ఎ.నా% చౌదరి సమక్షంలో 65వ వార్డులి తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ నియమించారు .65 వార్డ్ అధ్యక్షుడి గా. రట్టి వాసు. ఉపాధ్యక్షుడు గా పోతిన వెంకటేశ్వరరావు. వార్డు ప్రధాన కార్యదర్శిగా. యాదగిరి ప్రసాదు. క్లస్టర్ ఇన్చార్జిజు. దాట్ల శ్రీనివాసరావు. ట్రెజర్ గా సింగంపల్లి దేవుని. వార్డ్ నాయకులు కార్యకర్తలు మహిళలు ఎంపిక చేశారు . వార్డ్ అధ్యక్షుడు రట్టు వాసు మాట్లాడుతూ వార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరికీ ఎంతో రుణపడి ఉంటానని ,తనకు ఇచ్చిన అవకాశాన్ని పార్టీకి అంకితభావంతో పనిచేస్తానని పల్లా శ్రీనివాసరావు తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు .

## నామినేటెడ్ పోస్టుల్లో యువతకు తోలి మొదట ప్రాదాన్యత



గాజువాక :పెన్ పవర్ ,మే 15:నామినేటెడ్ పోస్టుల్లో యువతకు తప్పకుండా ప్రాధాన్యం ఇస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తాడేపల్లిలోని ఏపీ సీఎం చంద్రబాబును గురువారం టీఎన్ఎస్ఎఫ్ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు ఎస్. రతన్ కాంత్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఒక్కరి కష్టానికీ ఫలితం ఉంటుందని, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కష్టపడిన వారందరికీ పదవులు సిద్ధంగా ఉంటాయని పేర్కొన్నారు. అదే విధంగా డీఎస్సీ, కానిస్టేబుల్ నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఏమనుకుంటున్నారోనని అడిగి తెలుసుకున్నారు. గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీతోపాటు 6100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ, రూ. 8.5లక్షల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా 5లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం యోచించినందుకు రతన్ కూడా సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం హయంలోనే కాపు భవనం నిర్మాణం తధ్యమని

# కాపులకు అండగా కూటమి ప్రభుత్వం

- వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, మే 15 :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాపులకు ఎల్లవేళల అండగా ఉంటుందని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటన లో తెలిపారు. నగరంలో కాపు సామాజిక వర్గం కోసం కాపు భవనం నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. గతంలో టీడీపీ హయంలో కాపు భవనం కోసం ఎకరా భూమి కేటాయిస్తే, వైఎస్ఆర్సీపీ హయాంలో అది 50 సెంట్ల కు కుదించారని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు విడుదల చేయకుండా ఎన్నికల సమయంలో నాటి వైఎస్ఆర్సీపీ నేతలు హడావుడిగా భూమి పూజ చేసి వదిలేశారని విమర్శించారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం కాపులకు చేసింది ఏమి లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హయంలోనే కాపు భవనం నిర్మాణం తధ్యమని పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.





ఆలమూరు, పెన్ పవర్,మే15:మండలంలోని జొన్నాడ గ్రామంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-2012 మధ్య ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 13 ఏళ్ల తరువాత ఒకరినొకరు పలుకరించుకుంటూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలకు వాటర్ కూలర్ ను అందజేశారు. పూర్వ విద్యార్థులు గురువులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఫోటోలు దిగి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు గంగాధర్, దివాకర్, శ్రీనివాసు, రాజు, కృష్ణమూర్తి, చక్రవర్తి, లలిత, సబిత, సత్య కృష్ణవేణి, విద్యార్థులు పూర్ణ రెడ్డి, సురేందర్ రెడ్డి, సూర్యచంద్ర, వీరబాబు, సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు



కాకినాడ.పెన్ పవర్ మే 15 :ఈ నెల 19 నుంచి 28 వరకు జరగనున్న పదో తరగతి సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువిన పదో తరగతి విద్యార్థులకు, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదోవ తరగతి, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై డీఆర్వో జె.వెంకటరావు.. రెవెన్యూ, పాఠశాల విద్య, ఓపెన్ స్కూల్ సొసైటీ, పోస్టల్, జిల్లా పరిషత్, పోలీస్, ట్రెజరీ, రవాణా, విద్యుత్, వైద్య ఆరోగ్యం, ఆర్టీసీ, పంచాయతీ, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాలు, పరీక్ష పత్రాల స్టోరేజ్ పాయింట్లు, పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై ఈ సందర్భంగా ఆయన అధికారులతో చర్చించి, ఏర్పాట్లపై అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాల్లో 5,956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ప్రశ్నాపత్రాలు స్టోరేజ్ నిమిత్తం 18 పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పదోతరగతి (ఓపెన్ ఎస్ఎస్‌సీ), ఓపెన్ ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయని డీఆర్వో తెలిపారు. ఈ పరీక్షలలు అన్ని జిల్లాలో సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమని చర్యలు చేపట్టాలన్నారు. రెగ్యులర్ పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలతో పాటు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ఉదయం పూట నిర్వహించడం జరుగు తుందన్నారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 1151 మంది విద్యార్థులకు 04 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసేమన్నారు. స్టోరేజ్ కేంద్రాల నుంచి పరీక్ష పత్రాలను సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేర్చడం దగ్గర నుంచి జవాబు పత్రాలను తిరిగి పోస్ట్ ఆఫీస్ కు పంపేవరకు ప్రతి విషయంలోనూ వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, పరీక్షా అనంతరం తిరిగి ఇళ్లకు చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసీ సర్వీసులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని వైద్య ఆరోగ్యం, పంచాయితీ శాఖల అధికారులను ఆదేశించారు. 144 సెక్షన్ అమలు, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యల విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పీ.రమేష్, డీటీసీ లక్ష్మి కిరణ్‌బీ పోస్టల్ పీఆర్ఐపీ కె.ప్రసాద్ రావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయివెంకట రమణ, ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.

# తారు రోడ్డు ప్రారంభోత్సవం చేసిన ప్రభుత్వ విప్.





గుమ్మలక్ష్మీపురం.మే 15.పెన్ పవర్:నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ %ం% కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. గురువారం నాడు లక్కగూడ గ్రామం నుండి సదనుగూడ గ్రామం వరకు 75 లక్షలు నిధులతో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును కురుపాం ఎమ్మెల్యే శ్ తోయక జగదీశ్వరి ప్రారంభించారు. రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రహదారుల నిర్మాణం.మంచి నీటి సదుపాయం వంటివి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. సదనుగూడ గ్రామాన్ని ఎమ్మెల్యే సందర్శించి ప్రజలతో మాట్లాడుతూ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రారంభోత్సవానికి ముందు ఎమ్మెల్యే మొక్కలను నాటే కార్యక్రమము చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్. కడ్రక కళావతి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి. వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి.అడ్డాకుల నరేష్, నాయకులు రామారావు, ప్రసాద్, చిన్న, రాజేష్, మన్మధ, కొండలరావు, యువరాజ్, అప్పలస్వామి, భాస్కరరావు, ఐ.టీ.డీ.ఏ ఏ.ఈ అప్పారావు, ఇంజనీర్ అధికారులు, రెవిన్యూ అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్ప్రేయింగ్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీచేసిన జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్రుడు.



కురుపాం, పెన్ పవర్, మే 15,మండలంలోని మొండెంఖల్ పి.హెచ్. సి పరిధిలో నిర్వహిస్తున్న స్ప్రేయింగ్ ప్రక్రియను జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్రుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు చేపడుతున్న ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ గ్రామాల్లో పూర్తి స్థాయిలో జరిగేలా స్ప్రేయింగ్ చేయాలి అన్నారు. అలాగే ప్రతీ ఇంటికి లోపల భాగంలో ఏవైనా వస్తువులు ఉంటే వాటిపై టార్పస్ కప్పాలని అన్నారు.స్ప్రేయింగ్ జరగబోయే గ్రామాలను సబ్ యూనిట్ అధికారులు ముందస్తుగా తెలియజేసి కచ్చితంగా నిర్వహించాలని, క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే పక్కగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటికి దోమల మందు పిచికారీ చేస్తున్న తీరును గమనించారు .స్ప్రే చేసిన ఇళ్లకు మార్కింగ్(ఎండార్స్మెంట్) పక్కాగా ఉండాలన్నారు. స్ప్రే చేస్తున్న సిబ్బంది మాస్క్,కళ్లజోళ్ళు,చేతి తొడుగులు తప్పక ధరించాలన్నారు. స్ప్రేయింగ్ అయిపోయిన అనంతరం స్ప్రేయింగ్ చేసే పరికరాలని బాగా సుబ్రపరచి తర్వాత రోజు తీసుకువెళ్లాలి అన్నారు. ఐఆర్ఎస్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రజ్ఞ,హెల్త్ సూపర్వైజర్లు భారతి, నాగేశ్వరరావు. హెల్త్ అసిస్టెంట్ జె. తిరుపతిరావు, ఏ.ఎన్.ఎం. జ్యోతి, ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్.



కురుపాం /జియ్యమ్మవలస, పెన్ పవర్, మే -15, జియ్యమ్మవల్స మండలం చిన మేరంగి గ్రామంలో కురుపాం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. శ్రీ నివాస రావు సిబ్బంది నాటు సారాను నిరోధించే కార్యక్రమం లో భాగంగా దాడులు చేసి ఒకరిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి 20 లీటర్ల నాటు సారాయి సీజ్ చేసి అతడి మీద మరియు నాటు సారా ను సరఫరా చేసిన వారి పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా సిఐ శ్రీ నివాస రావు మాట్లాడుతూ గ్రామాలలో ఎవరైనా గాని అక్రమంగా నాటు సారాయి తయారీ చేసిన, రవాణా అమ్మకాలు చేసినా , గ్రామాలలో గొలుసు దుకాణాల నిర్వహణ కు వేలం పాటలు నిర్వహిస్తున్నా. అటువంటి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలుపుతూ వాటిని నిర్వహిస్తున్నట్లయితే ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరడమైనది .ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ ఎస్. ఐ. రాజు శేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవస్వామి ఆలయంలో కొండచిలువ హల్ చల్.

- నిత్య పూజ సందర్భంగా ప్రత్యక్షం
- చాకచక్యంగా పట్టుకున్న అర్చకులు శ్రీనివాస్ శర్మ



విశాఖ ఉత్తరం, పెన్ పవర్, మే 15,ప్రముఖ పుణ్యక్షేత్రం మాధవధార లో వెలసిన శ్రీ మాధవ స్వామి ఆలయంలో గురువారం ఉద యం కొండచిలువ పాము హల్ చల్ చేసింది. ఆలయ అనువంశిక అర్చకులు నపపల రవీంద్ర కుమార్ ప్రతినిత్యం చేసే పూజల్లో భాగంగా పూజలు చేస్తుండగా పామును చూశారు. వెంట నే శివాలయం అర్చకులు శ్రీనివాస్ శర్మకు తెలి యజేశారు. అర్చకులు ఎంతో చాకచక్యం తో పామును అక్కడ నుంచి తీసుకొని పెద్ద కర్ర సహాయంతో మాధవధార తోటల్లోకి వదిలేశారు. ఈ దృశ్యాన్ని చూస్తున్న భక్తులు కొంత భయ భ్రాంతులకు గురై అనంతరం తన వీడియోలో పాము తొలగిస్తున్న దృశ్యాన్ని చిత్రీకరించు కున్నారు. వాస్తవానికి ఆలయంలో స్వరంగ మార్గం ద్వారా అప్పుడప్పుడు పాములు ప్రత్యక్షం అవుతుంటాయని అర్చకులు రవీంద్ర కుమార్ తెలిపారు.

## విశాఖ ఫార్మాసిటీ సెజ్ లో కస్టమ్స్ కార్యాలయ అదనపు విభాగం ప్రారంభం.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న విఎస్ఈజెడ్ జాయింట్ డెవలప్మెంట్ కమిషనర్ శ్రీమతి రోషిని అపరంజి కోరాటి.







పరవాడ ( పెన్ పవర్) మే 15: విశాఖ ఫార్మాసిటీ ఎస్ ఈ జెడ్ లో గల కస్టమ్స్ కార్యాలయ అదనపు విభాగాన్ని వి ఎస్ ఈ జెడ్ జాయింట్ డెవలప్ మెంట్ కమిషనర్ శ్రీమతి రోషిని అపరంజి కొరాటి గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్టమ్స్ ఆఫీస్ లో వచ్చే ప్రొబేషనర్ కి శిక్షణ ఇవ్వడానికి ఇది అనువైన కేంద్రమని తెలియజేశారు. ఇంత మంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కల్పించిన విశాఖ ఫార్మాసిటీ యాజమాన్యానికి , వారి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆఫీసు మంచి ఆహ్లాదకరమైనటువంటి వాతావరణంలో ఉన్నదని కొనియాడారు. ఈ అదనపు సౌకర్యము ఫ్యాక్టరీ యాజమాన్యాలకు వేగవంతమైన సేవలు అందించడానికి ఏర్పాటు చేయడమైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ జే ఎన్ హెచ్ కే వరప్రసాద వర్మ, డిప్యూటీ కమిషనర్ - కస్టమ్స్ మరియు స్పెసిఫైడ్ ఆఫీసర్, శివప్రసాద్ రెడ్డి, డిప్యూటీ డెవలప్మెంట్ కమిషనర్ , శ్రీమతి రమ్య మెట్ల అసిస్టెంట్ డెవలప్మెంట్ కమిషనర్ (లేబర్), మరియు విశాఖ ఫార్మసిటీ డెవలపర్ తరఫున ఆ కంపెనీ డీజీఎం ఫైనాన్స్ సత్యం నాయుడు , డీజీఎం హెచ్ఆర్ అండ్ అడ్మిన్ గిరిధర్ రావు బత్తి, ఎస్ఇ జెడ్ లో గల ఇతర పారిశ్రామిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చోడవరం పోలీస్ స్టేషన్‌కు ఆకస్మిక తనిఖీ - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



చోడవరం,పెన్ పవర్ మే 15:అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్., చోడవరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి విస్తృత తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల విచారణ పురోగతి, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు.స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ పి.అప్పలరాజు, ఎస్సైలు బి.జోగారావు, బి.నాగ కార్తీక్‌తో సమావేశమై ఆయన పలు కీలక సూచనలు చేశారు. ప్రజలతో మరింత సమగ్ర సంబంధం ఏర్పరచుకోవాలని, పోలీసు సేవలు పారదర్శకంగా మరియు వేగవంతంగా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని, స్టేషన్ నిర్వహణలో ప్రమాణాల మేరకు క్రమబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాత్రి గస్తీ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు మీద ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. చెడు నడత గలవారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. బాధితులతో సానుభూతితో ప్రవర్తించాలని, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచే విధంగా ప్రవర్తించాలని, ప్రతి పోలీస్ సిబ్బంది నిబద్ధతతో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ గారు పేర్కొన్నారు.ఈ తనిఖీ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ పి.అప్పలరాజు, ఎస్సైలు బి.జోగారావు, బి.నాగ కార్తీక్ సహా స్టేషన్ సిబ్బంది ఎస్పీ గారి వెంట ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఉషూ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో చోడవరం క్రీడాకారులకు పతకాలు



చోడవరం పెన్ పవర్ మే 15: ఈ నెల 12 నుండి 14 వ తారీకు వరకు కర్నూల్ లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఉషు చాంపియన్షిప్ పోటీల్లో చోడవరం గణేష్ డిఫెన్స్ అకాడమీలో ఉచిత శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడం జరిగింది.

విజేతలు: జూనియర్ విభాగంలో 45 కేజీల క్యాటగిరి తేజ స్వరూప్ బంగారు పతకం సాధించగా, విమెన్స్ సీనియర్ విభాగములో 60 కేజీల కేటగిరీలో లావణ్య రజత పతకం, 65 కేజీల కేటగిరిలో సాయి లక్ష్మి కంచు పతకం సాధించి త్వరలో రాజస్థాన్ జైపూర్ లో జరగబోయే నేషనల్ పోటీల్లో పాల్గొంటారని గణేష్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ పుల్లేటి గణేష్ తెలియజేశారు. పతకాలు సాధించిన విజేతలను రాష్ట్ర ఉషు అసోసియేషన్ సెక్రటరీ నరసింహారావు , ఆంధ్ర ప్రదేశ్ ఉషు అసోసియేషన్ ఫౌండర్ మోహన ముత్యాలరావు , ట్రెజరీ వెంకటేష్ , కోచ్ రమ్య , చోడవరం ప్రజలు అభినందించారు

## ఒక నెల వ్యవధిలోగా అన్ని పనులను పూర్తి చేయాలని

- వి.ఎమ్.ఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్



స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మే 15 :క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వివిఎమ్ఆర్డిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, గురువారం పెదగంట్యాడలో రహదారి విభాగిని లో చేపడుతున్న క్రీడా సంబంధిత అభివృద్ధి పనులను జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారిణి తో కలిసి పరిశీలించి అక్కడ ఏ ఏ క్రీడ సంబం ధిత కోర్టులు నిర్మాణం చేపట్టాలో చర్చించిన పిదప ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరుగు తున్న పనులను సాంకేతిక విభాగపు అధికారు లతో కలిసి పరిశీలించి ఒక నెల వ్యవధిలోగా అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి అనకాపల్లి జిల్లా కోడూరు -2, సంగినా రపాడు, కుంచంగి %- 1 ం% 1ఎ సంస్థ చేపడుతు న్న బి.టి రహదారులు, %ఐఐ% కాలువల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని త్వరిత గతిన పనులన్నీ పూర్తి చేయాలని, అదేవిధంగా తుంపాల కన్వెన్షన్ సెంటర్ మరియు గ్రామ గోపా లరావు ఆడిటోరియంలో చేపడుతున్న జోనల్ ఆఫీస్ నిర్మాణాపనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కోడూరు - 4 లేఅ వుట్లో జరుగుతున్న బృహత్ ప్రణాళిక రహదారి పనులలో వేగం మందగించడానికి గల కారణా లు తెలుసుకుని స్థానిక రైతులతో మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని చెప్పారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఎస్.వి ఎస్.ఎన్ రాజు, రామరాజు, రాంబాబు ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజ నీర్లు తదితరులు పాల్గొన్నారు

## మే 20 సమ్మె జయప్రదం చేయండి అని సిఐటియు జిల్లా కోశాధికారి వి వి శ్రీనివాసరావు, ఎస్ వి నాయుడు పిలుపు నిచ్చారు



చోడవరం పెన్ పవర్ మే 15:కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు, ముఠా, ఆటో కార్మికుల కు సమగ్ర చట్టం , వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు తదితర డిమాండ్లతో జరగబోవు మే 20వ తేదీ సమ్మెలో కార్మికులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి వి వి శ్రీనివాసరావు, ఎస్. వి నాయుడు లు పిలుపునిచ్చారు. ఈరోజు చోడవరం లో కళాసీలతో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వల్ల సమ్మె చేసే హక్కు , సంఘం పెట్టుకునే హక్కు, పనిగంటలు పెంచడం, పారిశ్రామిక వివాదాలు చట్టానికి తూట్లు పొడవటం వంటి అనేక దుర్మార్గమైన విధానాలు ఈ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన ముఠా, బిల్డింగ్, ఆటో, మోటార్ ట్రాన్స్ పోర్ట్ రంగాల కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమం వంటివి కోల్పోతారన్నారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించకుండా తిప్పికొట్టాలని, అందుకే మే20 న దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని దీనిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ చంద్ర శేఖర్, వెంకటరావు, శ్రీను, నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 5 తేదీన జాతీయ లోక్ అదాలత్

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు.



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్టణం, మే 15 :జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో జులై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాల విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 – 2560414, 2575046 ఫోన్ నెంబర్లలో, మండల న్యాయ సేవ సంఘాలు భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# జగన్ ప్రభుత్వంలో శ్రీ యెర్నిమాంబ ఆలయా న్ని విస్తరిస్తాం





- నీల ధార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్కుమార్
- ఆవరణంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేపట్టాలి
- 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 15** :శ్రీ యెర్నిమాంబ అమ్మవారి జాతరోత్సవాల్లో జీవీఎంసీ 41 వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వ ర్యంలో జరిగిన నీలదార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని అమ్మవారినీ దర్శించుకున్నారు. జ్ఞానపురం నుండి అమ్మవారి ఆలయం వరకు భారీగా స్థానిక మహిళలతో పసుపు నీళ్ల బిందులు పట్టుకొని జరిగిన యాత్రలో వాసుపల్లి పాల్గొని చీర, పసుపు కుంకుమ బుట్టను తలపై పట్టుకుని ఆలయానికి నడిచి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆయనతోపాటు వైసీపీ కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, కోరుకొండ వెంకట స్వాతి దాస్, రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎంతగానో కృషి చేశారన్నారు. మళ్లీ ప్రజల ఆశీస్సులతో రానున్న జగన్ ప్రభుత్వంలో పంటల తల్లి, సంతాన దేవతగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి శ్రీ యెర్నిమాంబ అమ్మవారి ఆలయాన్ని మరింత విస్తరించే విధంగా కృషి చేస్తానని అమ్మవారి పాదాల సాక్షిగా వాసుపల్లి తెలిపారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడి ఆలయాన్ని తొలగించే ప్రక్రియలో వాసుపల్లి గణేష్ కుమార్ అడ్డుకొని స్థానికంగా అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం లోనే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో భక్తులకు సౌకర్యార్థం అన్ని వసతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధిని అడ్డుకునే కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్థానిక అమ్మవారి ఆలయంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లండ రమణ, 41వ వార్డు వైసిపి నాయకులు వేలంగిని రావు, కుమార్, మురళి, కిషోర్ అప్పారావు, పరీష్, అర్జున్, భవాని, రవి, ప్రసన్న, శ్యామ్ బాబ్జి, ప్రసాద్, గనగళ్ళ, రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఈ-బీట్స్ విధానం అమలుతో పోలీసు గస్తీ పటిష్టం

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం మే 15** :రాత్రి/పగటి పహారాను లైవ్లో పర్యవేక్షించి, సమయానుకూలంగా సిబ్బందిని అవసరమైన ప్రాంతానికి పంపవచ్చునన్న జిల్లాలో నేరాలను నియంత్రించుటకు "ఈ-బీట్స్" విధానంను అమలు చేసి, పోలీసు గస్తీని మరింత పటిష్టం
చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మే 15న తెలిపారు. ఈ-బీట్స్ విధానంపై పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించి, ఈ-బీట్స్ అమలు చేయుటలో వారి సందేహా లను నివృత్తి చేందుకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూమ్ మీటింగు నిర్వహించారు, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - పోలీసు గస్తీలో సాంకేతిక పరిజ్ఞానంను వినియోగిస్తూ ఈ-బీట్స్ విధానంతో పోలీసు గస్తీని మరింత పటిష్టం చేసి, పోలీసు పహారాను సమర్ధవం తంగా, పారదర్శకంగా అమలు చేయనున్నామ న్నారు. ఈ విధానంతో పోలీసు గస్తీని ట్రాక్ చేయడం, వారి నిర్వహించే పహారా విధులను విశ్లేషించడం, పర్యవేక్షించడం లైవ్లోనే చేయను న్నామన్నారు. ఈ బీట్స్ విధానంలో పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు అధికారులు, సిబ్బందికి ముందుగా యూజర్ ఐడిలు, పాస్వర్డ్స్ క్రియేట్ చేయడం జరుగుతుంద న్నారు. పోలీసు స్టేషను పరిధిలోని వివిధ ప్రాంతాలను బీట్లుగా క్రియేట్ చేసి, వాటిని రాత్రి లేదా పగలు వహారాకు వెళ్ళేపోలీసుల యూజర్ ఐడిలకు అనుసంధానం చేస్తామన్నారు. ఈ బీటు క్రియేట్ చేసే సమయంలో బీటు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన ఎ.టి.ఎం. కేంద్రాలు, బస్టాండులు, రైల్వే స్టేషనులు, బ్యాంకులు, లాక్డ్ హౌస్లు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల వివరాలు, షాపింగ్ మాల్స్ వంటి వాటి వివరాలు, ఏ ప్రాంతంలో ఎంత సమయం పహారా కాయాలి, గస్తీ తిరగాలన్న విషయాలు నమోదు చేయబ డతాయన్నారు. ప్రతీ రోజూ పోలీసు స్టేషను అవసరాలు, ప్రాధాన్యతలను అనుసరించి, ఈ బీటును మార్పులు చేసుకోవచ్చునన్నారు. పోలీసులు గస్తీ నిర్వహించే సమయంలో ఏదైనా సంఘటనలు జరిగినట్లయితే వాటి ఫోటోలను ఈ-బీట్ అలర్ట్స్ అనే అప్షన్తో సంబంధిత అధికారులు ఎక్కడ నుండైనా పరిశీలించ వచ్చు నన్నారు. ఈ-బీట్స్ అమలుతో పోలీసు సిబ్బంది నిర్వహించే గస్తీ విధులను లైవ్లోను, గస్తీ పూర్తయిన తరువాత వారు ఎక్కడ, ఎంత సమయం, ఏవిధంగా విధులు నిర్వహించినది నివేదికతో సంబందిత ఎస్.హెచ్.ఓ. మరియు జిల్లా ఎస్పీ సులువుగా తెలుసుకొనే వెసులు బాటు ఉంటుందన్నారు. సమయ పాలన, గస్తీని, పహారాని పటిష్టం చేయడం వలనల నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు.
అత్యవసర సమయంలో బీటు సమాచారాన్ని విశ్లేషించి, నేర ప్రాధాన్యత ఉన్న ప్రాంతానికి బలగాలను సంఘటనా స్థలంకు పంపవచ్చునని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ-బీట్స్ యాప్ పని చేసే విధానాన్ని టెక్నీషియన్ హర్ష బందలం జూమ్ ద్వారా పోలీసు అధికారులు,
సిబ్బందికి వివరించి, వారి సందేహాలను నివృత్తి చేసారు. ఈ జూమ్ మీటింగులో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, ఎస్బి సిఐలు ఎ.వి.లీలా రావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనాభివృద్ధి పై కాన రాని బాధ్యత..?



- సుమారు నాలుగేళ్లయినా పత్తాలేని పాలకవర్గ సమావేశం...
- గిరిజనుల పట్ల వైసిపి, కూటమి పాలకుల సవతి ప్రేమ..
- పక్కదారి పడుతున్న గిరిజన సంక్షేమానికి చెందిన ఐటిడిప నిధులు
- సుమారు 6 కోట్ల పైబడి నిధులు కలెక్టరేట్ కు తరలింపు...!
- గవర్నమెంట్ ఫండ్స్ పై వచ్చిన వడ్డీ ఏమవుతోంది...?
- ఇన్చార్జిలతో నెట్టుకొస్తున్న ఐటీడీప పాలన
- గిరిజనేతరుల పాలవుతున్న నిధులు, ఉద్యోగాలు
- అప్పుడు డిప్యూటీ సీఎంలు, ఇప్పుడు గిరిజన శాఖ మంత్రి ఉన్నా పాలకవర్గ సమావేశం సున్నా...!
- పార్వతీపురం ఐటిడిప తీరుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కురుపాం /పార్వతీపురం:పెన్ పవర్, మే-15,** పార్వతీపురం ఐటీడీఏ అధికారులు, పాలకులకు గిరిజనాభివృద్ధిపై బాధ్యత లేకపోవడం వల్లే ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించడం లేదని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, జిల్లా నాయకులు కోలా కిరణ్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకర్రావు తదితరులు పార్వతీపురం ఐ టి డి ఏ వద్ద విలేకరులతో మాట్లాడారు. సుమారు నాలుగేళ్ల క్రితం నిర్వహించిన ఐటిడిఏ పాలకవర్గ సమావేశం గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసి, మళ్లీ వాయిదా వేయటం, వాయిదాల పేరుతో దాటు వేయటం అధికారులకు కొత్తేమీ కాదన్నారు. గతంలో వైసిపి గిరిజనాభివృద్ధి పట్ల చిన్న చూపు చూడటం వల్లే పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేకపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల బట్టి చూస్తే అధికారులు, కూటమి పాలకులు గిరిజనులపై సవతి ప్రేమ చూపిస్తున్నారనేది స్పష్టమవుతోందన్నారు. వైసిపి కాలంలో డిప్యూటీ సీఎంలు, కూటమి పాలనలో గిరిజన శాఖ మంత్రి ఉన్నప్పటికీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేకపోవటం బాధాకరమన్నారు. గిరిజనులమని చెప్పుకొని, గిరిజనుల ఓట్లతో పదవులు పొందిన వైసిపి, టిడిపి పాలకులు గిరిజనాభివృద్ధి కోసం, గిరిజన సంక్షేమం కోసం పాటుపడాల్సిన ఐటీడీఏ నిర్వీర్యం అవుతుంటే కనీస చర్యలకు ఉపక్రమించకపోవడం బాధాకరమన్నారు. గిరిజనుల సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి చక్కని ప్రణాళికలు రచించి, వారి అభివృద్ధి కోసం ఎంతో దోహద పడే పాలకవర్గ సమావేశాలు జరపకపోవడం గిరిజనుల దౌర్భాగ్యం అన్నారు . పాలకవర్గ సమావేశాలు జరిపితే ఐటీడీఏ లో జరిగిన అవినీతి, అవకతవకలు బయటపడతాయన్న భయంతోనే పాలకవర్గ సమావేశాలు నిర్వహించడం లేదని అనుమానించవలసి వస్తోంది అన్నారు. ఇదిలా ఉండగా గిరిజన సంక్షేమానికి వినియోగించాల్సిన ఐటిడిఏ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. సుమారు 6 కోట్లకు పైబడి ఐటీడీఏ నిధులు కలెక్టరేట్ కు తరలిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్న ఐటిడిఏ నిధులు ప్రైవేట్ బ్యాంకులకు మారినట్లు పార్వతీపురంలో గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిధులు పై వచ్చిన వడ్డీ ఏమవుతుందని ప్రశ్నించారు. అది కూడా గిరిజన సంక్షేమానికి వినియోగించకుండా పక్కదారి పడుతోందని ఆరోపించారు. ఐటీడీఏ ఫిక్స్ డ్ డిపాజిట్లు కూడా మాయమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఐటీడీఏ నిధులు అధికారుల భవనాల సోయగాలకు వినియోగిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదన్నారు. ఒకప్పుడు కళకళలాడే ఐటిడిఏ జిల్లా కలెక్టరేట్ వచ్చాక మసకబారి వెలవెలబోతోందన్నారు. కీలకమైన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో పాటు పలు పోస్టులు ఇన్చార్జిలతో నెట్టుకు రావటం వలన గిరిజనాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందన్నారు . ఇదిలా ఉండగా అవినీతిని ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు దాదాపు శూన్యంగానే ఉన్నాయన్నారు. గత రెండేళ్లుగా గిరి వెలుగు ఏపీడి పై వస్తున్న అవినీతి ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇక తాగునీరు, చెక్ డ్యాములు, గిరిజన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర మాట తదితరవి వరసకు కూడా కానరావడం లేదన్నారు. జిసిసి దాదాపు అంపశయ్యపై ఉందని ఆరోపించారు. గిరిజనులకు చెందాల్సిన నిధులు గిరిజనేతలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల ఉద్యోగాలు హాయిగా గిరిజనేతరులు అనుభవిస్తున్నారన్నారు. దీనికి ఉదాహరణగా గిరిజనేతరుడైన ఓ విలేకరి కుమార్తె కు ఉద్యోగం ఇచ్చారని గిరిజన సంఘాలు ఐటిడిఏ వద్ద చేసిన ధర్నాను గుర్తుకు తెచ్చారు. ఏటా గిరిజన విద్యార్థుల మృత్యు ఘోష ఆగడం లేదన్నారు. ఐటీడీఏ పెట్రోల్ బంక్ ద్వారా వస్తున్న లాభాలు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. వచ్చిన లాభాలు గిరిజన సంక్షేమానికి వినియోగించాలన్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కనీసం జీతాలు కూడా పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, రోడ్లు తదితరవి గిరిజనులకు ఎప్పటికీ పుష్కలంగా అందుతాయోనని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం పార్వతీపురం ఐటిడిఏ పై దృష్టి సారించి, పక్కదారి పట్టిన నిధులపై, అవినీతి, అవకతవకలపై దర్యాప్తు చేయాలన్నారు. ఐటీడీఏ నుండి పక్కకు మళ్ళిన కోట్లాది రూపాయల నిధుల నిగ్గు తేల్చి, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్రవ్యాప్త ఆటోలు వ్యాన్లు బంద్ ప్రభుత్వాని కి కళ్ళు తెరిపించాలని డ్రైవర్ల పిలుపు

- మే 24 రాష్ట్ర వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మె

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మే 15** :విశాఖ జిల్లాలో ఆటోలు వ్యాన్లు బంద్ ను సమ్మె జయప్రదం చేయండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డ్రైవర్ల పిలుపు నిచ్చారు మే 24 రాష్ట్ర వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మె విశాఖ జిల్లాలో ఆటోలు బంద్ నుజయప్రదం చేయాలని రాష్ట్రవ్యాప్త ఆటోలు వ్యాన్లు బంద్ చేసి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించాలని కోరుతూ మే 16 ఉదయం 10:30 కి ఆర్టీసీ ఇన్ గేటు వద్ద ఆటో డ్రైవర్లు ప్రచార కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటియుసి రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జివామనమూ ర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలు గు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని మే 20 నసార్వత్రిక సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు బంద్ ను జయప్రదం చేయాలని డ్రైవర్లు కుపిలుపుని చ్చారు చంద్రబాబు నాయుడు ఆటో డ్రైవర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వాహన మిత్ర 15000 డ్రైవర్ల పిల్లల తల్లికి వందనం జరిమానాలపై జీవనం 21 రద్దు చేయాలని డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ నిత్యవసర వస్తుందరలో తగ్గించాలని నగర పరిధిలో ఉబర్ ఓలా రాపిడ్ వాహనాలు విశాఖ నగరంలో ఆటోలకి పార్కింగ్ స్థానాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి సిహెచ్ కాసుబాబు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చంద్రబాబులు కార్మిక హక్కులను కాలరాస్తూ బడ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు కల్పిస్తూ పేదవాలైన ఆటో డ్రైవర్లకు తిండి లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు ఇప్పటికైనా డీజలు పెట్రోలు గ్యాస్ ధరలు భారీగా పెట్టి ప్రజల మీద ఆర్థిక భారాలు వేసుకున్నారని ఈ విధానాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మే 20 న విశాఖలో ఆటోలు బంద్ సమ్మెలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో యుశివాజీ రవి కృష్ణ దేవుడు నూకరాజు బి సూర్యారావు పి అప్పలరాజు సిహెచ్ నాయుడు కే రాము టీ నగేష్ వై వెంకట్ లు పాల్గొన్నారు ఇట్లు స్టాండ్ అధ్యక్షులు అప్పలరాజు




## పశ్చిమ నియోజకవర్గం పునః రూపకల్పన ప్రతిపాదనలకై సమావేశం.

- జీవీఎంసీ 5వ జోనల్ కమిషనర్ బి.రాము.

**విశాఖ పశ్చిమం పెన్ పవర్ మే 15** :మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పునః రూపకల్పన చేసేందుకు ప్రతిపా దనలు తయారు చేయుటకు 16వ తేదీన సమా వేశం నిర్వహించబడునని 5వ జోన్ జోనల్ కమిషనర్ బి.రాము గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా విశాఖ పట్నం పశ్చిమ నియోజకవర్గం పరిధి పునః రూపకల్పనకై జ్ఞానపురం జోన్-5 కార్యాలయం లోని సమావేశ మందిరము నందు తే 16.05.2025 శుక్రవారం ఉ.గం. 11.00 గంటలకు 5వ జోనుకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాలలో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలను స్వీకరించుటకై సమావేశాన్ని ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు.

## జల జీవన్ మిషన్ ద్వారా దేవరపల్లి పంచాయతీలో బోర్ల తవ్వకం

- సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మే15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని లక్కవరం,మెట్ట గూడ గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా బోర్ల తవ్వక కార్యక్రమంను స్థానిక సర్పంచ్ సిరిబాల బుజ్జి బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుజ్జి బాబు మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది కాలంలోనే మా పంచాయతీకి అభివృద్ధి ఫలాలు దప దపాలుగా అందుతున్నాయి. మేమంతా ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆశిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుమ్మడి రాజబాబు, కూటమి నాయకులు లకే రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. పంచాయతీ అభివృద్ధిలో ఈ చర్యలు మైలురాయిగా నిలుస్తాయని ప్రజలు అభిప్రాయపడ్డారు.

## జీవో నెంబర్ 3 స్థానంలో కొత్త చట్టం ఇచ్చేంతవరకు పోరాటం ఆగదు..

- జేఏసీ పార్వతిపురం మన్యం జిల్లా కమిటీ..




**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మే -15.** ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐటీడీఏ ఎదుట ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఏజేఏసీ పార్వతీపురం మన్యం జిల్లా తరపున గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది
ఈ నిరాహార దీక్షలో ఇటీవల డీఎస్సీ 2025 మెగా డీఎస్సీలో ప్రకటించిన ఐటిడిఏ పరిధి ఏజెన్సీ ప్రాంతంలోని టీచర్ పోస్టులను మినహాయించి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఆదివాసులల్లే నియమించాలని ఆదివాసి నిరుద్యోగం నిరక్షరాస్యత దృష్ట్యా షెడ్యూల్ ప్రాంతం ఉపాధ్యాయులు నియమకాలు చట్టం రూపొందించాలని మరియు ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి (టి ఏ సి) లో ఏడుగురు ఎస్టి ఎమ్మెల్యేలు ఉన్నందున మిగిలినవారినీ ఎస్టీలకు చెందిన వారిలో పూర్తిస్థాయి కమిటీ నియమించాలని ఈ రిలే నిరాహార దీక్ష సందర్భంగా ప్రభుత్వానికి కోరడమైనది లేనిపక్షంలో ఈ పోరాటం మరింత ఉధృతంగా చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ టి.జయన్న , ఎం.అమర్నాథ్ వై.సూర్యనారాయణ, టి సత్యనారాయణ, డి. సీతారాం, ఐ. రామకృష్ణ ఎ .చంద్రశేఖర్ కే గౌరమ్మ పి. రంజిత్ కుమార్, యు.మల్లయ్య గౌడ్ సురేష్ ఎం నాగభూషణ తదితరనిరుద్యోగ యువత పాల్గొన్నారు

## ఆర్.వి.నగర్-పాలగడ్డ అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంపీకి వినతిపత్రం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలానికి చెందిన ఆర్.వి.నగర్ నుంచి వై.రామవరం మండలంలోని పాలగడ్డ వరకు కొనసాగుతున్న అంతర్రాష్ట్ర రోడ్ గత 12 సంవత్సరాలుగా మరమ్మతుల్లేక శిథిలావస్థకు చేరడంతో,ప్రజలు ఆ మార్గంలో ప్రయాణించడానికి భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణికి సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో స్థానిక పెద్దలు నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ, రోడ్డుపై తగిన చర్యలు తీసుకొని పనులు త్వరితగతిన ప్రారంభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. పేరుకే అంతర్రాష్ట్ర రోడ్ అయినప్పటికీ, కనీస మరమ్మత్తులు కూడా జరగకపోవడం చాలా బాధాకరమని సర్పంచ్ వ్యాఖ్యానించారు. ఈ రోడ్డును ఉపయోగించి మెరుగైన వైద్యం కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లే వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో, మాజీ వైఎస్ సర్పంచ్ కారే శ్రీనివాసు, చింతపల్లి క్యాంపు గ్రామస్తుడు కొర్ర జగ్గారావు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ లెక్చరర్లు తొలగింపేనా

**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:** తెలంగాణలోని విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపుపై నిర్ణయం ఆయా విశ్వవిద్యాలయాలకే ప్రభుత్వం వదిలేసింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ పేర్కొంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుది నిర్ణయాన్ని విశ్వవిద్యాలయాలకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది.అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారువిద్యాశాఖలో అవగాహన

లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయివిశ్వవిద్యాలయాల్లో దాదాపు 1500 మంది కాంట్రాక్టు.. అవుట్ సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకుండా.. ఖాళీలన్నింటినీ భర్తీ చేయవచ్చని వివరించినట్లు తెలుస్తోంది. దీనితో ఆయన వెంటనే ఖాళీల భర్తీకి ఆమోదం తెలిపారు. ఆ తరువాతే కాంట్రాక్టు లెక్చరర్లు తమను క్రమబద్ధీకరించాలని.. లేకపోతే టైమ్ స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు.

# రేషన్ కార్డుల ఏరివేత



**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:** తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల్లో నిజముంది. ఎందుకంటే రెండు రాష్ట్రాల్లో పథకాలను పొందుతూ, రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు ఉన్న వారు అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడినా అక్కడ సొంత ఇల్లు.. ఇక్కడ ఉపాధి కోసం వచ్చిన వారు రెండు చోట్ల రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుంటున్నారు. నిజంగా ఇది దురదృష్టకరమే. ప్రజాధనం పక్కదోవపట్టడమే అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకుని కేవలం ఒక రాష్ట్రంలోనే రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఉచిత పథకాలు అందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం అమ్ముకునే వారికి ఎందుకు ఇవ్వాలని ఆయన వేసిన ప్రశ్నలో కూడా అర్థం ఉంది. తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబలు ఉంటే పొరుగు రాష్ట్రానికి చెందని వారికి కూడా ఇక్కడ రేషన్ కార్డులన్నాయన్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా బియ్యం తీసుకోవడంతో అవి పక్కదారి పట్టే అవకాశముంది. అదే సమయంలో రెండు చోట్ల పథకాలను అందుకుంటుంటే ప్రభుత్వ ఖజానాపై కూడా భారం పడే అవకాశముంటుంది. ఒకరు ఒక రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను పేదలు అందుకోవాల్సి ఉంటుందికానీ అర్హతలులేని వారు కూడా అనేక మంది ఉచితాలు పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రెండుచోట్ల రెండు ఓట్లు ఉన్నాయి. వేర్వేరు సార్లు ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి ఓటేస్తారు. ఇక్కడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్ ఒకేరాష్ట్రంలో ఒకేచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్ననిబంధన పెట్టింది. ఇప్పుడు అలాగే పథకాలను కూడా ఎక్కడో ఒకచోట మాత్రమే తీసుకునే అవకాశం కల్పిస్తే నిజమైన పేదలకు పథకాలు అందుతాయి. ప్రభుత్వాలకు కూడా కొంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ఖజానా పై భారం తగ్గుతుందని ఉన్నతాధికారులు కూడా చెబుతున్నారు.

# 19 వేల కోట్లతో మెట్రో సెకండ్ ఫేజ్



**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) 86.5 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో విస్తరించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను హెచ్ఏఎంఎల్ ఆమోదించింది. త్వరలో మంత్రివర్గ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల రుణాలు, పీపీపీ విధానం ద్వారా కూడా నిధులు సేకరించనున్నారు. మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) విస్తరణ ప్రణాళిక దాదాపు 19 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించబడింది. ఈ ప్రతిపాదిత విస్తరణలో భాగంగా, మూడు ప్రత్యేక మార్గాల్లో మొత్తం 86.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను విస్తరించనున్నారు. ఈ కొత్త మార్గాల్లో జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు, అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించింది, దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమోదం పొందిన నివేదికను ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది, మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన మూడు మార్గాల కోసం ప్రత్యేక డీపీఆర్ లను రూపొందించారు. మునుపటి ప్రణాళికల్లో జేబీఎస్–శామీర్‌పేట , జేబీఎస్–మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ నిర్మాణాన్ని చేపట్టాలని భావించారు, ఇక్కడ ఒకే స్తంభంపై రెండు అంతస్తుల్లో రవాణా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేయాలనుకున్నారు..ఒక అంతస్తులో రహదారి, మరొకటి మెట్రో రైలు కోసం. అయితే, స్టేషన్లు అధిక ఎత్తులో ఉండటం వలన ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని భావించి, హెచ్ఏఎంఎల్ ఈ ప్రతిపాదనను విరమించుకుంది.కొత్త ప్రతిపాదనల ప్రకారం, జేబీఎస్ నుండి కారా?నా, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ.. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రన్‌వే రహదారికి సమీపంలో ఉండటంతో.. భద్రతా కారణాల దృష్ట్యా ఎలివేటెడ్ మార్గానికి రక్షణ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. దీని కారణంగా.. ఈ మార్గంలో దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు భూగర్భ మార్గంలో మెట్రో రైలును నిర్మించాలని నిర్ణయించారు. రన్‌వే కింద నుండి మెట్రో రైలు వెళ్లేలా తుది డిజైన్‌ను రూపొందించారు.జేబీఎస్ నుండి తాడ్ బండ్, బోయిన్ పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ కొన్ని ఆంక్షలు విధించడంతో, ఈ మార్గంతో పాటు శామీర్‌పేట మార్గం కూడా జేబీఎస్ నుండి ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గం కంటే తక్కువ ఎత్తులో వెళ్లేలా ప్రణాళిక చేశారు. జేబీఎస్ ను మూడు మార్గాలకు అనుసంధానం చేస్తూ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్గాలను రూపొందించారు.శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ విమానాశ్రయంలోని టెర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో, రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ మార్గంలో మెట్రో రైలు వెళ్తుంది. అక్కడి నుండి, ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో వెళ్లేలా డీపీఆర్ ను రూపొందించారు.ఈ ప్రతిష్టాత్మక రెండవ దశలోని రెండవ భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన 48 శాతం నిధులను బ్యాంకుల నుండి రుణాలుగా సేకరిస్తారు. మరో 4 శాతం నిధులను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పీపీపీ) విధానంలో సేకరించాలని యోచిస్తున్నారు.

## కాళేశ్వరం త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోఛ్చారణలతో మారుమోగుతోంది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగంమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. కాగా, ఈరోజు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - పద్మ దంపతులు వేకువ జామునే త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేశారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటి వరకూ స%శీ%ప్రదాయానికే పరిమితమైన సరస్వతి పుష్కరాలు ఈ సారి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు కలిసిన చోట అంతర్వాహినిగా సరస్వతీ నది ఉద్భవించిన ప్రాంతంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లతో పాటు పలువురు ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతీ పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హజరయ్యారు.

## అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని సందర్శించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్: పెన్ పవర్:** అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అఫ్జల్గంజ్ పిఎస్ పరిధిలో ఓ భవనంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. గోల్ మసీదు సమీపంలోని ఓ భవనంలో మూడవ అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. మంటల్లో చిక్కుకున్న ఒక చిన్నారిని మరి కొంతమందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు.

## గ్రీవెన్స్ కార్యాక్రమంలో పాల్గోన్న మంత్రి ఆనం

**మంగళగిరి: పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ తలపెట్టిన "గ్రీవెన్స్ కార్యక్రమం"లో గురువారం నాడు మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గోన్నారు. ప్రజల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులపై సమస్యలు పరిష్కారం దిశగా అక్కడక్కడే అధికారులతో మాట్లాడారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తో పాటు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ %డ% ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కూడా పాల్గొన్నారు

## జవాబుదారీతనాన్ని పెంచాలి మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ: పెన్ పవర్:** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బందితో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలో ఆరోగ్య, సంక్షేమ పథకాల పురోగతి, ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. పనితీరును సమీక్షించుకుని, లోపాలను సరిచేసుకోవాలి. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. జవాబుదారీతనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగాన్ని పెంచాలి. కొత్త ఆలోచనలకు, పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

## అకాల వర్షంతో నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకుంటాం

### తక్షణ సహాయంగా రూ. 21,500

### ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు కృషి

### ఎమ్మెల్యే విజయరమణ రావు

**పెద్దపల్లి ప్రతినిధి: పెన్ పవర్:** ఓదెల మండలం మడక గ్రామం లో రాజ కొమురయ్యకు చెందిన 26 మేకలు, గొర్రెలు వర్షం కారణంగా కరెంట్ షాక్ తో మరణించడంతో గురువారం బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబనికి ఎమ్మెల్యే విజయరమణ రావు రూ. 21,500 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గొర్రెల పెంపకం పై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కుటుంబం ఈ ప్రమాదం వల్ల ఎంతో నష్టపోయిందన్నారు. ఈ కుటుంబానికి తాము అండగా ఉంటామని చెప్పారు. సీఎండీ, విద్యుత్ శాఖ ఉన్నతాధికారు లతో మాట్లాడి అవసరమైన సహకారాన్ని బాధిత కుటుంబానికి అందించాలని కోరినట్లు వారు తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రభుత్వ పరంగా కూడా సహాయాన్ని అందిస్తామన్నా రు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎ.డి.ఈ, ఎ.ఈ, స్థానిక తహసిల్దార్, సి.ఐ సుబ్బా రెడ్డి, మడక గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి నది పుష్కర స్నానమాచరించిన గండ్ర జ్యోతి

**కాళేశ్వరం:** వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ %డ% భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి సరస్వతి నది పుష్కర స్నానమాచరించారు. 12 ఏండ్లకు ఒక్కసారి వచ్చే సరస్వతి పుష్కరాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా,కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమంలో నేటి నుండి ప్రారంభం అయిన నేపథ్యంలో సరస్వతి ఘాట్ వద్ద బంధుమిత్రులతో కలిసి త్రివేణి సంగమంలో పూజ కార్యక్రమం నిర్వహించి పుష్కర స్నానాలు చేసి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు.

# వీరయ్య చౌదరికి మంత్రి లోకేష్ నివాళులు



**ఒంగోలు పెన్ పవర్:** ఇటీవల దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. వీరయ్య చౌదరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని లోకేష్ గుర్తుచేసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహ రెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు..

# వ్యభిచారం ముఠా గుట్టు రట్టు నిందితుల్లో బంగ్లా దేశీయులు

**సికింద్రాబాద్: పెన్ పవర్:** గోపాలపురంలో నార్త్జోన్ టాస్క్ఫోర్స్ పోలీసుల దాడులు జరిగాయి. వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టును టాస్క్ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. ఇద్దరు బంగ్లాదేశీయులతో పాటు మొత్తం ఐదుమందిని అరెస్ట్ చేసారు. బంగ్లాదేశ్ కు చెందిన అమ్మాయిలతో సాకిన్ ఓసేన్, విమల్ సేన్ వ్యభిచారం చేయిస్తున్నారు.పోలీసుల అదుపులో ఇద్దరు యువతులు ఒకరు బంగ్లాదేశ్, మరొక్కరు పశ్చిమ బెంగాల్ చెందిన వారిగా గుర్తించారు. ముగ్గురు యువకుల్లో ఒకరు బంగ్లాదేశీయుడు. అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి భారత్ వచ్చినట్లు గుర్తించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ లో నిందితులను అప్పగించారు.

# మంటల్లో బస్సు దగ్ధం

**మేడ్చల్: పెన్ పవర్:** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ మండలంలోని బండ మైలారం నుండి కొంపల్లికి వెళ్తుండగా మేడ్చల్ ఐటిఐ వద్ద రాగానే ఓ ప్రైవేట్ బస్సు లో మంటలు ఒకసారిగా చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాడు. క్షణాలో బస్సు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ద్వారానే బస్సు దగ్ధమైందని డ్రైవర్ తెలిపారు. సంఘటనా స్థలానికి ఫైర్స్ ఇంజన్ నీ చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని పూర్తి వివరాలను సేకరించారు.

# పది కోట్ల బంగారం వ్యాపారి పరారీ

**బాచుపల్లి: పెన్ పవర్:** బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గత 15 సంవత్సరాలుగా చేతన్ జువెలర్స్ పేరిట ప్రగతి నగర్?లో నితీష్ జైన్ అనే వ్యక్తి బంగారం వ్యాపారం చేస్తున్నాడు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలతో నితీష్ జైన్ పరారయ్యాడు. దీంతో.. అతని బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మే10వ తేదీ నుంచి దుకాణం తెరవకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది.



స్థానికంగా ఉన్న బంగారు దుకాణాల వద్ద బంగారాన్ని తీసుకు వచ్చి ఆభరణాలు చేయడంతో పాటు కస్టమర్లకు అమ్ముతూ దుకాణదారులకు జైన్ దగ్గరయ్యాడు. తన నెట్?వర్క్?ను పెంచుకుంటూ అందరికీ నమ్మకం కలిగించి ఒక్కసారిగా భారీగా బంగారు ఆభరణాలతో జంప్ అయ్యాడు.

భారీ మొత్తంలో అతనికి బంగారం ఇచ్చిన నగల దుకాణాదారులు లబోదిబోమంటున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టుకుని మరీ వడ్డీలకు ఇస్తుండే వాడని బాధితులు తెలిపారు. స్కీంలు కూడా పెట్టి బాధితులను నితీష్ జైన్ ఆకర్షించాడు. కేపీహెచ్?బీ, బాచుపల్లి పరిధిలో తన వ్యాపారాన్ని నితీష్ జైన్ సాగించాడు.

# సమ్మెను విజయవంతం చేసి కేంద్రం మెడలు వంచుదాం

బడా పారిశ్రామికవేత్తలకు తొత్తుగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన తలపెట్టిన సమ్మెను విజయవంతం చేద్దామని ఐ ఎన్ టి యు సి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాలిగామ మల్లేష్ ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్,సిఐటియు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సోమారపు వెంకన్న టీబీజీకేఎస్ నాయకుడు తిరుపతి, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఓసిపిత్రీ లోని బేస్ వర్క్ షాప్ వద్ద సమ్మె సన్నాహక ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాల రద్దు కోసం భారతదేశ కార్మిక వర్గం వీరోచిత పోరాటాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు,, అదే మాదిరిగా సింగరేణి కార్మిక వర్గం సైతం భవిష్యత్తులో జరగబోయే ఏ తరహా ఉద్యమాలకైనా సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. అధికార మదంతో విర్రవీగిన నరేంద్ర మోడీ రైతాంగ పోరాటాలకు తలదించక తప్పలేదని వారు గుర్తు చేశారు. భారతదేశం కార్మిక వర్గం రైతాంగ పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. అనంతరం ఈనెల 20వ తేదీ సమ్మెను విజయవంతం చేద్దామని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. అంతకుముందు ఏఐటియుసి సెంట్రల్ నాయకులు ఎల్ ప్రకాష్ అధ్యక్షత ఉపన్యాసం చేయగా, ఐ ఎన్ టి యు సి, బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ కరక శ్రీనివాస్ ముగింపు ఉపన్యాసం చేసి, ద్వారా సమావేశాన్ని ముగించారు. లిఈ కార్యక్రమంలో ఏఐటియుసి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ లిరాజరత్నం, ఫిట్ సెక్రటరీ కుమారస్వామి,ఐఎన్టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బర్ల రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బానోత్ జాన్, నాయకులు కంది శ్రీనివాస్, నిరంజన్ సిఐటియు వైస్ ప్రెసిడెంట్ రాంప్రసాద్, భూమయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు

## ప్రియుడి కోసం భర్తను హత్య చేయించిన భార్య

**మెదక్: పెన్ పవర్:** ప్రియుడితో కలిసి భర్త శ్రీను హత్యకు భార్య మరో వ్యక్తితో కలిసి 50 వేల రూపాయలకు సుపారి ఇచ్చిన వైనం ఇది. హత్య అనంతరం తన భర్త కానిపించడం లేదని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది కిలాడి భార్య లత. హవేలీ ఘనపూర్ (మం) షమ్నాపూర్ గ్రామంలో ఘటన జరిగింది. లత అదే గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అనేక సార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి నచ్చజెప్పినా, లత పద్ధతి మార్చుకోలేదు. భర్త అడ్డును తొలగించుకోవడానికి మోహన్ అనే వ్యక్తికి 50 వేలు ఇచ్చి భర్తను హతమార్చుమని చెప్పింది. పథకం ప్రకారం గత నెల 16న మద్యం తాగుదామంటూ శ్రీనుని అనంతసాగర్ గ్రామ శివారులోకి తీసుకెళ్లిని మోహన్ బీరు సీసాతో తలపై కొట్టి హత్య చేసాడు. గత నెల 28వ తేదీన తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది లత . పోలీసులు విచారణ చేస్తుండగా, అనుమానంతో నిలదీయగా తామే హత్య చేశామని లత, ప్రియుడు మల్లేష్ అంగీకరించారు.

# ట్రంప్ టవర్స్ కు ఎసరు...

**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:** హైదరాబాద్ రియాల్ ఎస్టేట్ మార్కెట్‌లో గ్లోబల్ బ్రాండ్‌గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్‌కతా, గుర్‌గావ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్‌కు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాందెల రామ్‌రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్‌రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్‌రెడ్డికి 425 గజాల వాటా ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య



వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్‌రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది. అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్‌ను వెనక్కి నెట్టవచ్చు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్ట్‌లకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు. రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

# గాలి జాతకం అలా అయిపోయిందే..?

**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:**
కోట్లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఏముంది? జీవితంలో ఎక్కువ భాగం జైలుకే పరిమితమయితే ఇక సంపాదించింది అనుభవించడం కూడా లేని అది దరిద్రమైన జాతకం గాలి జనార్ధన్ రెడ్డిది. అక్రమంగానో.. ఎలాగోనో గాలి జనార్ధన్ రెడ్డి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గాలి కుటుంబం కర్ణాటకు వెళ్లి సెటిలయింది. కర్ణాటకలో అనేక వ్యాపారాలు చేసి కోట్లాది రూపాయలను కూడబెట్టింది. గాలి జనార్ధన్ రెడ్డికి ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నాయో ఆయన కుమార్తెకు చేసిన వివాహంలో చేసిన హంగూ ఆర్భాటాలు చూస్తేనే అర్ధమవుతుంది. బంగారు పళ్లేలు, నగలు, నట్రా.. ఇలా ఒకటేమిటి.. బంగారంతో పొదిగిన అన్నీ విలువైన వస్తువులు.కాలుకదిపితే ఏ కారు వస్తుందో ఆయనకు కూడా తెలియదు. ఇక ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఏసీల్లోనే గాలి సేదతీరతారు. అలాంటి గాలి జనార్ధన్ రెడ్డి ఇప్పుడు చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో నలుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. వీరిపై ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానాను కూడా విధించింది. గతంలోనూ కొన్నేళ్ల పాటు గాలి జనార్ధన్ రెడ్డి శిక్ష అనుభవిస్తూ జైలు జీవితం గడిపారు. అయితే ఆ శిక్షను మినహాయించాలని కోరినా న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీంతో గాలి జనార్ధన్ రెడ్డి చంచల్ గూడ జైలులో నిందితుడిగా ఉంటూ ఉన్నారుఇంట్లోనే మనం ఉండలేకపోతున్నాం. ఇక బిజినెస్ మాగ్నెట్ అయిన గాలి జనార్ధన్ రెడ్డి జైల్లో ఉక్కపోతకు మగ్గిపోతున్నారట. తనకు జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలంటూ గాలి జనార్ధన్ రెడ్డి పిటీషన్ వేశారు. అయితే గాలి పిటీషన్ ప్రస్తుతం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. ఈ కేసులో విచారించి ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కానీ గాలి జనార్ధన్ రెడ్డి జైలు జీవితం గడపలేకపోతున్నారని అర్ధమవుతుంది. తనకు ఇంటి నుంచి భోజనంతో పాటు నిద్రించడానికి బెడ్, ఫ్యాన్ తో పాటు మరికొన్ని సౌకర్యాలు కోరుతున్నారు. పాపం చేసిన గాలికి ఈ శిక్ష సరిపోతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అక్రమాలకు అనుభవించాల్సిందేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి. రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కూడా లేనట్లే.అందుకు జనార్దన్ రెడ్డి స్పందిస్తూ.. తన వయసును, తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి, శిక్షను తగ్గించాలని కోరారు. ఆయన విన్నపై జడ్జి స్పందిస్తూ..'ఈ కేసులో పదేళ్ల శిక్ష ఎందుకు వేయకూడదు' అని ప్రశ్నించారు. తాను ఇప్పటికే నాలుగేండ్లకు పైగా సామాజిక సేవ చేస్తున్నానని.. బళ్లారితో పాటు గంగావతిలో కూడా ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గాలి జనార్దన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకే ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం.. చివరకు ఆయనకు ఏడేళ్ల శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసు సంచలనం సృష్టించింది. ఏపీ అనంతపురం జిల్లాలోని ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సీబీఐ ఈ కేసును విచారించి.. పలువురిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసింది.విచారణలో భాగంగా గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీ ఖాన్, ఓఎంసీ కంపెనీని దోషులుగా నిర్ధారించింది. వీరికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. అలానే ఈ కేసుకలో ఆరోపణలు ఎదుర్కొన్న సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.

# గులాబీలో కుర్చీలాట

**హైదరాబాద్, మే 15, పెన్ పవర్:**
భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు.2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ, రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి, అసహనానికీ తార్కాణంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు. పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# కడప రెడ్డమ్మ పగ తీర్చేసుకున్నారుగా

**కడప, మే 15, పెన్ పవర్:** కడప జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కసి తీర్చుకున్నారు. కడపలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మాధవి రెడ్డి గెలిచారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె నిత్యం వార్తల్లో ఉంటున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు కొన్ని సార్లు విమర్శలకు ఎదురవుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. మాధవి రెడ్డి కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదుగుతున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి కి టీడీపీ కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇస్తుంది. పార్టీ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. తాజాగా కడప మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించి తన పవర్ ఏంటో మాధవిరెడ్డి చూపించగలిగారువైసీపీకి, సురేష్ బాబుకు సానుభూతి వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే తాను అనుకున్నది సాధించడంలో మాధవి రెడ్డి ముందున్నారని మాత్రం చెప్పాలి. తాను శపథం చేసినట్లుగానే తనకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో వేదికపై కుర్చీ ఇవ్వనంందుకు చివరకు మేయర్ కుర్చీనే లాగేశారు. మున్సిపల్ నిబంధనలను అడ్డుపెట్టి మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించారు. మేయర్ సురేష్ బాబు తన కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులు అప్పగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా కడప మేయర్ సురేష్ బాబుపై వేటు వేసింది. దీంతో ఆయన కుర్చీ ఇవ్వనందుకు తన కుర్చీనే కోల్పోవాల్సి వచ్చింది.మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించింది. గతంలో ఇన్ని స్థానాలను టీడీపీ ఎప్పుడూ గెలవలేదు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది.యితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదనే చెప్పాలి. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. దీంతో ఆమెకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు.మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. జగన్ సొంత జిల్లాలో అదీ కడపలో గెలవలేకపోయినా పార్టీ జెండాను రెడ్డప్పగారి కుటుంబం వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. మాధవీ రెడ్డి గెలిచిన దగ్గర నుంచి స్పీడ్ గానే ఉన్నారు. కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారినా ఆమె వెనక్కు తగ్గలేదు. కార్పొరేషన్ సమావేశంలోనే మాధవి రెడ్డి శపథం చేశారు. తనకు వేదికపై కుర్చీ వేయని నువ్వు కుర్చీలో ఉలా ఉంటావో చూస్తానంటూ వెళ్లిపోయారు. అనుకున్నట్లే మాధవి రెడ్డి అనుకున్నది సాధించారు.

**కాంట్రాక్టు పనులకు అప్పగించారని...**

మేయర్ ను సురేష్ బాబును ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి తమ బంధువులకు కాంట్రాక్టు పనులకు అప్పగించారన్న ఆరోపణలపై కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారని విచారణలో తేలిందని మున్సిపల్ శాఖ తెలిపింది.దీనిపై నోటీసులు ఇచ్చిన మున్సిపల్ శాఖ విచారణకు హాజరు కావాలని కోరింది. నిన్న సురేష్ బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి ఎదుటహాజరయ్యారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులకు అప్పగించారన్న ఆరోపణలపై ఆయనను తొలగిస్తూ నిర్ణయిం తీసుకున్నారు. ప్రభుత్వం సురేష్ బాబుపై అనర్హతవేటు వేసింది.

# బుగ్గన పార్టీ మారుతున్నారా..

**కర్నూలు మే 15, పెన్ పవర్:**



వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని స్థాయిలో చక్రం తిప్పిన ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. 2024 ఎన్నికలలో బుగ్గన పరాజయం పాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ లో తెలుగుదేశం అభ్యర్థి కోట్ల విజయం సాధించారు. డోన్ లో తెలుగుదేశం జెండా ఎగరడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చంద్రబాబు వ్యూహం ఫలించి కోట్ల విజయం సాధించారు. బుగ్గన పరాజయం పాలయ్యారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా చక్రం తిప్పి, ఐదేళ్లూ వరుసగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బుగ్గన ఆ ఓటమితో డోన్ లో అడ్రస్ లేకుండా పోయారు. అపర మేధావిలా అసెంబ్లీ లో వ్యవహరించిన ఆయన ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో తన వ్యాపార వ్యవహారాల కోసం జగన్‌కి హ్యాండ్ ఇచ్చే ఆలోచన చేస్తున్నారంట. అయితే కూటమి పార్టీలు నో ఎంట్రీ బోర్డు పెట్టడంతో ఏం చేయాలో తోచక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ నడుస్తోంది.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. గతంలో ఈ సెగ్మెంట్ లో ప్రస్తుతం తెలుగుదేశంలో ఉన్న కేఈ, కోట్ల కుటుంబాలే ప్రత్యర్థులుగా కొనసాగాయి. 1978 నుంచి 2009 వరకు ఆ రెండు ఫ్యామిలీ మధ్యే ఎలక్షన్ వార్ నడుస్తూ వచ్చింది. 2014లో వైసీపీ నుంచి ఎంట్రీ ఇచ్చిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనూహ్యంగా కేఈ కృష్ణమూర్తిపై గెలుపొందారు. రెండోసారి కూడా గెలిచిన బుగ్గన ఆర్థిక మంత్రిగా అయిదేళ్లు చక్రం తిప్పారు రాజకీయ ప్రత్యర్థులైన దిగ్గజ కుటుంబాలు కేఈ, కోట్ల కుటుంబాలు గత ఎన్నికల సమయానికి ఒకే గూటి కిందకు చేరడం, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో బుగ్గనకు ఘోర పరాజయం తప్పలేదు. అదీ కాక నియోజకవర్గానికి అందుబాటులో ఉండకుండా అసెంబ్లీలో పిట్టకథలు చెప్తూ గడిపేసిన బుగ్గనపై డోన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ఓటమి తర్వాత బుగ్గన డోన్ వాసులకు నల్లపూసై పోయారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారిస్తోందన్న ప్రచారంతో భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులను, వారి వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బుగ్గన వేధింపులకు గురి చేశారన్న ఆరోపణలున్నాయి. అదే విధంగా బుగ్గనను ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఎప్పుడూ రాలేదు, అమరావతి, ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడుపుతూ నియోజకవర్గంలో ప్రజలకు దూరమయ్యారు. అంతేగాక సొంత పార్టీ కేడర్‌ను కూడా బుగ్గన పట్టించుకోలేదని టాక్. వాటికి తోడు సొంత మండలం బేతంచెర్లలోనే బుగ్గన తీవ్రస్థాయిలో అరాచకాలకు పాల్పడ్డారంట. ప్రస్తుతం కేసుల భయం వెంటాడుతుండటంతో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి జగన్‌కు హ్యాండ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారంట. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగి అక్కడి పెద్దలతో అంతో ఇంతో పరిచయాలు పెంచుకున్న ఆయన.. బీజేపీలో చేరడానికి వారితో మంతనాలు సాగిస్తున్నారంట. అందుకే ఆయన వైసీపీ కార్యక్రమాల్లో కూడా కనిపించడం లేదనీ, ఎక్కువ టైమ్ ఢిల్లీలోనే గడుపుతున్నారని బుగ్గన అనుచరులు చెప్పుకుంటున్నారంట. బీజేపీలో చేరడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాల సంగతి తెలిసి డోన్ కూటమి నేతలు తమ అధిష్టానాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చారంట. దాంతో బుగ్గనకు కూటమి పార్టీల్లో ఎంట్రీకి డోర్స్ క్లోజ్ అయిపోయారంటున్నారు. ఆ క్రమంలో బుగ్గన ఆచూకీ ఆయన సొంత అనుచరులకే అంతుపట్టకుండా తయారైందంట.

# చెవిరెడ్డి భాస్కరరెడ్డి గాయబ్...



**తిరుపతి, మే 15, పెన్ పవర్:** వైసీపీలో కీలక నేతగా వెలుగొందిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అధికారంలో ఉన్నంత కాలం తెగ దూకుడు ప్రదర్శించారు. అలాంటి ఫైర్‌బ్రాండ్ కనీళ్లు పెట్టుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. తన స్వగ్రామం తుమ్మలగుంట అత్మీయసభలో మీకు అన్ని చేశాను, కాని మీరు నా కొడుకును ఓడించారంటూ తన మనోవేదన వెళ్లగక్కిన సందర్భంలో ఆయన కళ్లు చెమర్చాయి. గత 11 నెలలుగా గ్రామస్తులలో ఎలాంటి సమావేశాలు పెట్టని అయన తాజాగా ఉన్నట్లుండి మీటింగ్ పెట్టారు. అసలు చెవిరెడ్డి ఎందుకు అంత అత్యవసరంగా అత్మీయ సమావేశం ఏర్పాటు చేశారనేది చర్చనీయాంశంగా మారింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో వైసిపి కీలక నాయకుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అంటే తెలియని వారుండరు. జగన్ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మంత్రి పదవి దక్కించుకోలేక పోయినప్పటికీ.. చాలా మంది మంత్రుల కంటే ఎక్కువగానే చెలాయించారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి ఏకంగా తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌లో తిరుమల దేవాలయ సెట్ వేయించి తన నాయకుడితో ఉగాది వేడుకలు నిర్వహింప చేసి తన వీరవిధేయత చాటుకుని విమర్శల పాలయ్యారు.2014లో టీడీపీలోని అనైక్యతతో చంద్రగిరిలో సొంత సామాజికవర్గం గల్లా అరుణకుమారిని వ్యతిరేకించడంతో చెవిరెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 2019లో జగన్ గాలిలో సునాయాస విజయం సాధించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో పట్టు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా పండుగలకు తాయిలాలు పంచడంతో పాటు ఇంటింటికి శు భాకాంక్షలు వెళ్ళేవి. దానికి తోడు వాలంటీర్ వ్యవస్థ రాక ముందే తానే నియోజకవర్గంలో అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మంత్రాంగం సాగించారు. అలా అన్నీ కలిసి వచ్చి 2019లోఆయన భారీ మెజార్టీతో గెలవగలిగారు.ఎన్నికల తర్వాత శాసన సభ విప్‌తో పాటు తుడా చైర్మన్ పదవి కూడా అయనకే దక్కింది. తుడా పదవిని అడ్డంపెట్టుకుని చెవిరెడ్డి పెద్ద తతంగమే నడిపారు. తన గ్రామ సమీపంలోని తుమ్మలగుంట చెరువును సగానికిపైగా పూడ్చించి.. తుడా నుంచి 60 కోట్లు పైగా ఖర్చు పెట్టి అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌తో పాటు, అనేక విధాలుగా అభివృద్ధి చేసారు. చెరువును పూడుస్తున్నా చెవిరెడ్డి హవా చూస్తూ ఇరిగేషన్ శాఖ వారు నోరెత్తలేకపోయారంటారు. తుడా పరిధిలో ఇష్టా రాజ్యంగా బెంచీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి, ఆ బల్లలపై తన పేరు వేయించుకుని చెవిరెడ్డి చేసిన ప్రచార అర్భాటం ఇప్పటికీ ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది. దానికి తోడు రహదారులకు సైతం వైఎస్‌తో పాటు తన పేరు పెట్టుకున్న ఘనత ఆయనది. తుడా అనేది కేవలం చంద్రగిరి నియోజకవర్గం వరకే అన్నట్లు పాలన సాగించారు. తుడా నిధులతో సొంత సర్వే టీములకు, వ్యక్తిగత సిబ్బందికి జీతాలు ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వాటితో పాటు అనేక రకాలుగా తుడా నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగాలున్నాయి.తుడా నిధులతో తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్కుపై ఇప్పటికీ వివాదాలు నడు స్తున్నాయి. పూర్వం చెరువు ఏలాగుందో అలా ఉంచాలని చాలామంది గ్రీన్ ట్రిబ్యునల్‌కువెళ్లారు. ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ అదేశాలతో అవిలాల చెరువును యాథావిధిగా ఉంచడానికి టీటీడీ ఇరిగేషన్ శాఖ అందులో ఉన్న నిర్మాణాలు తొలగిస్తోంది. ఇదే పరిస్థితి తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్క్‌కు కూడా పట్టే కాలం దగ్గరలో ఉందని అంటున్నారుఎన్నికలలో ఎంపీగా ఒంగోలు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు చెవిరెడ్డి. మరో వైపు చంద్రగిరిలో తన కూమారుడు మోహిత్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలో దించారు. మోహిత్ భారీ తేడాతో టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు పలు కేసులు, వివాదాలు చెవిరెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదుతో సీఐడీ కేసులు పెట్టి విచారిస్తోంది. తుడా నిధల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నది. దాంతో పాటు పోలింగ్ తర్వాత పులివర్తి నానిపై పద్మావతి మహిళా యూనివర్సిటిలో జరిగిన దాడికి సంబంధించి హత్యాయత్నం కేసుల విచారణ సాగుతోంది.వాటితో పాటు తుమ్మలగుంట చెరువులో ఉన్న పార్క్‌ను ఇప్పటి వరకు చెవిరెడ్డి తన సొంత ఆస్తిలా భావిస్తూ వచ్చారు.. ఇప్పుడు దాన్ని తుడా నిర్వహణలో తీసుకోవాలని పై స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో పావులు కదపడం మొదలు పెట్టారంట. గ్రామంలోని వారందరితో అత్యవసర అత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మరీ తాను అందర్నీ బిడ్డల కంటే ఎక్కువగా చూసుకున్నా, తన బిడ్డని ఓడించారంటూ సెంటిమెంట్ పండించే ప్రయత్నం చేశారంట. దాంతో పాటు పార్క్‌ను తుడా నిర్వహిస్తే దారుణంగా మారిపోతుందని దాని కోసం పోరాటం సాగిద్దామని పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా మారింది. పార్క్ కట్టిన చెరువు ఇరిగేషన్ శాఖది, అయితే నిధులు తుడావి అయినప్పుడు నిర్వహణ అవి చేయాలి కానీ తన పరిధిలో ఉంచుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తం మీద సొంత అస్తి కోల్పోతున్నట్లు చెవిరెడ్డి తెగ ఇదై పోతున్నారని అందరూ సెటైర్లు విసురుతున్నారు. పక్కనున్న హాథీరాంజీ మఠం భూములలో గ్రామస్తులు కొంతమంది ఇల్లు కట్టుకున్నప్పుడు వాటిని చెవిరెడ్డి కూల్చి వేయించారు. ఇప్పుడు తన దాకా వచ్చే సరికి నొప్పి తెలుస్తోందని గ్రామస్తులు దెప్పిపొడుస్తున్నారు. మొత్తం మీద చెవిరెడ్డి కన్నీటి ఎపిసోడ్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

## క్లైమాక్స్ కు చేరిన లడ్డూ కల్తీ కేసు

**హైదరాబాద్ పెన్ పవర్:** లడ్డూ ప్రసాదం కల్తీ కేసు దర్యాప్తులో సిట్ దూకుడు పెంచింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి మరీ దర్యాప్తు చేస్తున్న సంగతితెలిసిందే. సిట్ దర్యాప్తులో భాగంగా నెయ్యి సరఫరాకు తిరుమల తిరుపతి దేవస్థానం టెండర్ దక్కించుకున్న తమిళనాడు రాష్ట్రం దిండుగల్ కు చెందిన ఏఆర్ డైరీ నెయ్యి సరఫరా చేయలేదని తేలింది. మరి ఏం జరిగింది అంటే.. నెయ్యి ని ఉత్తరాఖండ్ రూర్కీలోని బోలేబాబ డైరీ నుంచి కొనుగోలు చేసి తిరుపతి జిల్లా లోని వైష్ణవి డైరీకి తరలించారు. అక్కడ ఏఆర్ డైరీ సీల్ వేసి టీటీడీకి సరఫరా చేశారు. ఈ విషయం దర్యాప్తులో తేలడంతో సిట్ అధికారులు నెల్లూరులోని ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అసలు శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలుత ప్రకటించారు. ఒక సభలో ఆయన జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందని ప్రకటించారు. హిందువులు ఆరాధ్యదైవం అయిన తిరుమల వేంకటేశ్వరస్వామి. ఈ శ్రీవారి దర్శన భాగ్యం అదృష్టంగా భక్తులు భావిస్తారు. అంతే అదృష్టంగా తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అందుకే స్వామి వారి లడ్డూ ప్రసాదం భక్తులకు అత్యంత ప్రీతిపాత్రం అయ్యింది. స్వామి వారి దర్శనం లేకపోయినా లడ్డూ ప్రసాదం లభిస్తే స్వామి వారి దయ ఉన్నట్లేనని భావిస్తారు. అలాంటి ప్రసాదం అపవిత్రం చేస్తూ జగన్ హయాంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ అయిందన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సభా ముఖంగా ప్రకటించారు. చంద్రబాబు ప్రకటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తెలుగుదశం కూటమి పార్టీలూ, వైసీపీల మధ్య మాటల యుద్ధమే జరిగింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసింది.అయితే ఈ కేసులో సిట్ దర్యాప్తుపై సందేహాలు వ్యక్తమౌతూ దాఖలైన పిటిషన్ ను విచారణకు స్వీకరించి.. ప్రత్యేక దర్యాప్తు బృందం సీబీఐ ఆధ్వర్యంలో జరగాల్సిందేనని ఆదేశించిన సుప్రీం కోర్టు కొత్త సిట్ ను ఏర్పాటు చేసింది. ఇప్పుడా ప్రత్యేక సిట్ ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో 12 మంది పేర్లు ఉన్నాయని చెబుతున్నారు. ఏ1 గా ఏఆర్ డైరీ, ఏ2 గా ఆ సంస్థ ఎండీ రాజు రాజశేఖరన్, ఏ3గా పొమిల్ జైన్, ఏ4గా విపిన్ జైన్, ఏ5 అపూర్వ చవాడాలను చేర్చింది. ఈ ఆరుగురినీ సిట్ పలుమార్లు విచారించింది. సిట్ అరెస్ చేసి పలు దఫాలు విచారణ చేశారు. ఏ6 బోలేబాబ డైరీ, ఏ7 వైష్ణవి డైరీని చేర్చారు. ఏ8 వైష్ణవి డైరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షబిల్ కలీముల్లాఖాన్ తో పాటు టీటీడీ ప్రొక్యూర్ మెంట్ ఉద్యోగి, బోలేబాబ సీజీఎం, నెయ్యి ముడిపదార్థాలు సరఫరా చేసే వారిని ఛార్జ్ షీట్ లో పొందుపరిచారు. త్వరలో మరింత మందిని విచారణ చేసే అవకాశం ఉంది.

## వైజాగ్ లో హెూం స్టే

**విశాఖపట్టణం, మే 15, పెన్ పవర్:** విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు హెూమ్ స్టే సౌకర్యాన్ని కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకూ అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు.

విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు 'ఇంటిలో ఆతిథ్యం' ఇవ్వాలనుకునేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పర్యాటక శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఎవరికైనా సొంత ఇల్లు/విల్లా/అపార్టుమెంట్ ఫ్లాట్ ఉండి, వాటిని పర్యాటకులకు రోజువారీ పద్ధతిలో అద్దెకు ఇవ్వడానికి ఆసక్తి ఉంటే పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖాధికారిణి జె.మాధవి సూచించారు. పర్యాటకులకు అన్ని ప్రాంతాల్లోను హెూటళ్లలో గదులు లభించవు. అలాగే తినడానికి ఆహారం కూడా దొరకదు. చాలామంది పర్యాటకులు స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రుచి చూడాలనుకుంటారు. అక్కడి మనుషులతో మాట్లాడి, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక కళల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇవన్నీ సాధారణ హెూటళ్లలో లభించవు. అటువంటి అభిరుచి కలిగిన వారికి స్థానిక విధానంలో 'వసతి సౌకర్యాలు' కల్పించడాన్ని 'హెూమ్ స్టే'గా వ్యవహరిస్తున్నారు.కేరళతో పాటు కశ్మీర్, పంజాబ్ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా వంటి దేశాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ హెూమ్ స్టే బాగా ఆదరణ పొందింది. దీనివల్ల స్థానికులకు కూడా ఉపాధి లభిస్తోంది. వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రచారం పెరుగుతోంది. ప్రభుత్వాలపై ఒత్తిడి తగ్గుతోంది. రాష్ట్రాలకు వచ్చే పర్యాటకులకు అవసమైనన్ని గదులు పర్యాటక, ప్రైవేటు సంస్థలు సమకూర్చలేకపోతున్నాయి. ఈ హెూమ్ స్టే వల్ల పర్యాటకంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్థానికులే వారి గృహాలను అందంగా అలంకరించి, వాణిజ్య ధరల కంటే తక్కువకే వసతి కల్పించడం, ఇంట్లో వండిన ఆహార పదార్థాలను ఆప్యాయంగా వడ్డించడం వల్ల పర్యాటకుల సంతృప్తి శాతం పెరుగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం దీనిని నూతన పర్యాటక పాలసీలో చేర్చింది. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకు అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు పేర్లు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) వెబ్‌సైట్‌లో ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రతించాలని జె.మాధవి సూచించారు. కొద్ది రోజులు గడిచాక ఆసక్తి కలిగిన వారిని పిలిచి అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధి విధానాలు తెలియజేస్తామని, పర్యాటకులే నేరుగా ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడి హెూమ్ స్టేను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

## మహారాజ్ గంజ్ లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** అఫ్జల్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహారాజ్ గంజ్ లో గోల్ మసీదు సమీపంలో ఓ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. మూడో అంతస్తులో మొదలైన మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. మూడో అంతస్తులో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆరు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి తెచ్చారు అగ్నిమాపక సిబ్బంది. కింద ఉన్న షాపు లలోకి మంటలు వ్యాపించకుండా మంటలను ఆర్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## రేషన్ బియ్యం పట్టివేత

**కరీంనగర్: పెన్ పవర్:** ధర్మారం మండలం ఎర్రగుట్టపల్లి వద్ద లారీలో అక్రమంగా తరలిస్తున్న 211 క్వింటాళ్ల రేషన్ సన్నబియ్యాన్ని సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టి పేట నుంచి హుజురాబాద్ కు తరలిస్తుండగా పట్టుకున్నారు. లక్షెట్టిపేటకు చెందిన సంపత్, ఉమామహేశ్వర్ పై కేసు నమోదు చేసారు. లారీ తోపాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు.

## సంగారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలు

## పలు చోట్లో ధాన్యం నీటిపాలు

**సంగారెడ్డి: పెన్ పవర్:** ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం సంగారెడ్డి జిల్లాలో నమోదు అయింది. సంగారెడ్డి జిల్లా కోహిర్ 9.5, పుల్కాల్ 7.5, లక్ష్మి సాగర్ లో 5.5 సెం. మీ వర్షపాతం నమోదుఅయింది. మెదక్ జిల్లా టేక్మాల్ 8.4, లింగంపల్లిలో 3.8 సెం. మీ వాన కురిసింది. భారీ వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. జోగిపేట, మెదక్, తూప్రాన్ ప్రాంతంలో ధాన్యం తడిసింది.

## పల్లప్రోలు గ్రామం లో మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి అనుమానస్పద మృతి

**ఆస్తి వివాదంలో తమ్ముడే హత్య చేసి ఉంటారని కుటుంబసభ్యుల అనుమానం**

**నెల్లూరు: పెన్ పవర్:** నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పల్లప్రోలు గ్రామం గోపాలపురం లో దారుణం చోటు చేసుకుంది. గ్రామంలోని పొలం వద్ద మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్ళిన మల్లికార్జున రెడ్డి రాత్రి 8 అయిన ఇంటికి రాకపోవడంతో అతని భార్య వెతుక్కుంటూ పొలం వద్దకు వెళ్ళింది. పొలం వద్ద ఆయన భర్త విగత జీవిగా పడి ఉన్నారు. తలకు బలమైన గాయం తగిలి ఉండడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ తో పాటు డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. అన్నదమ్ముల పొలం వివాదమే హత్యకు కారణంగా అనుమానిస్తున్నామని ఇన్చార్జి కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. విచారణ పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## వల్లభనేని వంశీకి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలు నుంచి ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. శ్వాస తీసుకోవడంతో ఆయన ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని జైలు సిబ్బందికి చెప్పడంతో వెంటనే ఆయన్ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వల్లభనేనికి ప్రస్తుతం వైద్యం అందిస్తున్నారు. ఈ విషయం బయటకు తెలియడంతో ఆస్పత్రి వద్దకు వైకాపా వర్గీయులు భారీగా చేరుకున్నారు. వల్లభనేని వంశీ ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.

## ప్లే ఆఫ్స్‌కు జోస్ బట్లర్ దూరం.. శ్రీలంక విధ్వంసకర బ్యాటర్‌ను రంగంలోకి దించిన గుజరాత్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) యజమాన్యాలకు ఇబ్బందిగా మారాయి. పాక్, భారత్ మధ్య యుద్ధ భయంతో ఐపీఎల్‌ను బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణగడంతో 2025, మే 17 నుంచి తిరిగి క్యాష్ రిచ్ లీగ్‌ను పునః ప్రారంభిస్తున్నారు. వారం రోజుల పాటు లీగ్ వాయిదా పడటంతో బీసీసీఐ కొత్త షెడ్యూల్ విడుదల చేసింది. అయితే.. ఐపీఎల్ షెడ్యూల్ మారడంతో ఫారెన్ ప్లేయర్స్ తమ జాతీయ జట్లకు సంబంధించి ముందుగానే షెడ్యూల్ ఫిక్స్ కావడంతో ఐపీఎల్‌కు దూరమవుతున్నారు.

ఈ నేపథ్యంలోనే గుజరాత్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఈ నెల (మే) 29 నుంచి ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య వైట్ బాల్ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్?కు జోస్ బట్లర్ ఎంపికయ్యాడు. దీంతో అతడు ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు దూరం కానున్నాడు. కీలకమైన ప్లే ఆఫ్స్‌కు బట్లర్ దూరం కానుండటంతో అతడి ప్రత్యామ్నాయంపై గుజరాత్ టైటాన్స్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బట్లర్ స్థానాన్ని శ్రీలంక స్టార్ బ్యాటర్ కుశాల్ మెండిస్‌తో భర్తీ చేసింది జీటీ. కుశాల్ మెండిస్‌తో అగ్రిమెంట్ చేసుకున్నట్లు గురువారం (మే 15) అఫిషియల్‌గా అనౌన్స్ చేసింది. కాగా, ఐపీఎల్ 18 సీజన్లో గుజరాత్ టైటాన్స్ అద్భుతంగా ఆడుతోంది. ఇప్పటి వరకు మొత్తం 11 మ్యాచులు ఆడి అందులో 8 విజయాలు సాధించి దాదాపు ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుంది. గుజరాత్ విజయాల్లో ఆ జట్టు కెప్టెన్ శుభమన్ గిల్, ఓపెనర్ సాయి సుదర్శన్, జోస్ బట్లర్ పాత్ర కీలక పాత్ర పోషించారు. బట్లర్ 71 సగటు, 163 స్ట్రైక్ రేట్?తో 500 పరుగులు చేశాడు. గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండటంలో బట్లర్ పాత్ర కూడా ఉంది. అయితే.. ఐపీఎల్ వాయిదా కారణంగా బట్లర్ కీలకమైన ప్లే ఆఫ్స్ మ్యాచులకు దూరం కానుండటంతో గుజరాత్ టైటాన్స్ కు భారీ ఎదురు దెబ్బనేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. బట్లర్ స్థానంలో గుజరాత్ భర్తీ చేసిన మెండిస్ %ూూ%లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరపున ఆకట్టుకుంటున్నాడు. మెండిస్ మూడుసార్లు 30ం పరుగులు సాధించాడు. 3/4 స్థానంలో బ్యాటింగ్?కు దిగి చివర్లో మెరుపులు మెరిపిస్తున్నాడు. 14 బంతుల్లో 35లి, 14 బంతుల్లో 28, 22 బంతుల్లో 36 పరుగులు చేశాడు. ఈ నేపథ్యంలో మెండిస్?ను ఎంచుకుంది గుజరాత్ టైటాన్స్. ఇక, మిగిలిన ఐపీఎల్ మ్యాచులు బెంగళూరు, జైపుర్, ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ, అహ్మదాబాద్ మొత్తం ఆరు వేదికల్లో జరగనున్నాయి. మే 29 క్వాలిఫయర్ 1, మే 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్ 2, జూన్ 3న ఫైనల్ నిర్వహించనున్నారు.

## సూపర్‌బెట్ చెస్ క్లాసిక్స్ టోర్నమెంట్‌లో టాప్‌లోనే ప్రజ్ఞానంద



**హైదరాబాద్ పెన్ పవర్:** బుకారెస్ట్: సూపర్‌బెట్ చెస్ క్లాసిక్స్ టోర్నమెంట్‌లో ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద సత్తా చాటుతున్నాడు. మంగళవారం రాత్రి జరిగిన ఆరో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన ప్రజ్ఞా పోలెండ్ ఆటగాడు డుడా జాన్‌తో డ్రా చేసుకున్నాడు. మొత్తం 3.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి టాప్‌లో కొనసాగుతున్నాడు. కానీ వరల్డ్ చాంపియన్ డి. గుకేశ్ ఫ్రాన్స్ ఆటగాడు అలీరెజాతో చేతిలో ఓడిపోయాడు. ఎండ్‌గేమ్‌లో ఈ పరాజయంతో గుకేశ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానానికి పడిపోయాడు. తెలంగాణకు చెందిన ఎరిగైసి అర్జున్ మూడో స్థానంలోకి వచ్చాడు.

## డబ్ల్యూటీసీ విన్నర్‌కు ఈసారి భారీ ప్రైజ్‌మనీ... గత ఎడిషన్లతో పోలిస్తే డబుల్!

- లార్డ్స్ మైదానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్
- జూన్ 11 నుంచి 15వ తేదీ వరకు మెగా సమరం
- ఫైనల్‌లో నెగ్గిన జట్టుకు రూ. 30.79 కోట్ల ప్రైజ్‌మనీ
- ఓడిన జట్టుకు రూ. 17.96 కోట్లు
- 2023లో విజేతకు రూ. 13.68 కోట్ల ప్రైజ్‌మనీ




**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌కు చెందిన ప్రైజ్‌మనీని తాజాగా ఐసీసీ ప్రకటించింది. గత టోర్నీలతో పోలిస్తే ఈసారి ప్రైజ్‌మనీని రెండింతలు పెంచేసింది. లండన్‌లోని ప్రఖ్యాత లార్డ్స్ మైదానంలో జూన్ 11వ తేదీ నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ జరగనున్న విషయం తెలిసిందే. అయితే, ఈ ఫైనల్ నెగ్గిన జట్టుకు 3.6 మిలియన్ల డాలర్ల (రూ. 30.79 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కనుంది. ఇక ఫైనల్లో ఓడిన జట్టుకు 2.1 మిలియన్ల డాలర్ల (రూ. 17.96 కోట్లు) ప్రైజ్‌మనీ అందుతుంది. కాగా, 2023లో భారత జట్టుపై ఫైనల్లో గెలిచిన ఆస్ట్రేలియాకు 1.6 మిలియన్ల డాలర్ల (రూ. 13.68 కోట్లు) ప్రైజ్‌మనీ దక్కింది. అలాగే రన్నరప్ టీమిండియాకు 8 లక్షల డాలర్లు (రూ. 6.84 కోట్లు) ఇచ్చారు. టెస్టు క్రికెట్ ప్రాముఖ్యతను పెంచే ఉద్దేశంతో ప్రైజ్‌మనీ పెంచినట్లు ఐసీసీ ఓ ప్రకటనలో పేర్కొంది.డబ్ల్యూటీసీ సీజన్ లో ఈసారి దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో నిలిచింది. శ్రీలంక, పాకిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లలో సఫారీలు విజయాలు సాధించడం కలిసొచ్చింది. దాంతో 69.44 శాతం పాయింట్లతో టేబుల్‌లో తొలి స్థానం కైవసం చేసుకుంది. ఇక, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా 67.54 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. 50.00 పాయింట్లతో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది.

ఇక, లార్డ్స్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకుంటే అదో మరుపురాని అనుభూతిగా మిగిలిపోతుందని ఆసీస్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ అన్నాడు. రెండేళ్లుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరడానికి తాము చాలా శ్రమించామని, తమ శ్రమకు ఫలితం దక్కిందని పేర్కొన్నాడు. అటు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా మాట్లాడుతూ... డబ్ల్యూటీసీ ద్వారా టెస్ట్ క్రికెట్‌కు ప్రాముఖ్యత పెరుగుతుందని తెలిపాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ద్వారా లాంగ్ ఫార్మాట్‌కు ఆదరణ దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. డబ్ల్యూటీసీ మెగా ఫైనల్‌కి లార్డ్స్ సరైన వేదిక అని అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియాపై అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నాడు.

# ప్రేమలు బ్యూటీ రేటు అదరగొడుతుందిగా!

ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రతీ వారం స్టార్లు మారుతూ ఉంటారు. ఒక వారం ఒకరు విజేతగా నిలిచి స్టార్ అయితే, మరోవారం ఇంకొకరు స్టార్ అవుతాయి. అందుకే ఇండస్ట్రీలో ఎవరెప్పుడు క్లిక్ అవుతారో, ఎవరికెప్పుడు ఎలాంటి స్టార్‌డమ్ వస్తుందో ఎవరూ చెప్పలేరు. కొంతమంది ఎన్నేళ్లు కష్టపడినా క్లిక్ అవకపోతే, మరికొందరికి మాత్రం ఫేమ్ వచ్చి రాత్రికి రాత్రే ఫేమస్ అయిపోతుంటారు. ప్రేమలు సినిమాలో నటించిన మమిత బైజు కు కూడా ఇలాంటి అదృష్టమే పట్టుకుంది. ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయిన మమిత ప్రస్తుతం తెలుగు, తమిళంలో పలు సినిమాల్లో నటిస్తోంది. వరుసపెట్టి సినిమాలు చేస్తున్న అమ్మడు, క్రేజ్ ఉన్నప్పుడే క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో తన రెమ్యూనరేషన్ ను కూడా బాగా పెంచిందని వార్తలు వినిపిస్తున్నాయి.మలయాళ ఇండస్ట్రీలో ముందుగా ఎన్నో సినిమాల్లో సపోర్టింగ్ రోల్స్ చేసిన మమితకు ప్రేమలు సినిమా మంచి క్రేజ్ ను తెచ్చిపెట్టింది. ఆ సినిమా వల్లే అమ్మడికి పలు భాషల్లో అవకాశాలొస్తున్నాయి. ప్రస్తుతం మమిత టాలీవుడ్ లోని అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న డ్యూడ్ సినిమాతో పాటూ దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న జననాయగన్ లో కూడా నటిస్తోంది.ఇంతకుముందు ఒక్కో సినిమాకు రూ. 50 లక్షలు లోపే ఛార్జ్ చేసిన మమిత, ఇప్పుడు డ్యూడ్ కోసం రూ.75 లక్షలు తీసుకుంటుందట. విజయ్ తో చేస్తున్న జననాయగన్ సినిమాకైతే ఏకంగా మమిత రూ. 1 కోటి ఛార్జ్ చేస్తుందని సమాచారం. ఈ రెండూ సినిమాలూ మంచి టాక్ తెచ్చుకుని హిట్ గా నిలిస్తే మమిత క్రేజ్ మరింత పెరగడం ఖాయం. అప్పుడు ఈ రెమ్యూనరేషన్ ను మమిత ఇంకా పెంచే అవకాశాలున్నాయి.



కుశిత కల్లపు క్యూట్‌నెస్‌ని వెదజల్లుతుంది





సంజీదా షేక్ తన తాజా ఫ్యాషన్ షూట్‌లో చాలా అందంగా ఉంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com